ప్రజాశక్తి

శనివారం 26 అక్టోబర్ 2024

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

ఆరు గదులకు ఒకటే ఫ్యాన్

- దోమల బెడద
- మరుగుదొడ్లు లేక బహిర్భూమికి..
- గదుల్లో చిమ్ముతున్న నీరు
- ప్రహరీలేక లోపలకు పందులు, పాములు
- తాగునీటికీ కటకటే..
- ఇదీ హోం మంత్రి అనిత ఇలాఖాలో ఎస్‌సి వసతి గృహ విద్యార్థుల దుస్థితి



వసతి గృహ పరిసరాల్లో తిరుగుతున్న పందులు

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత నివాసానికి సమీపంలో.. జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న ఎస్‌సి వసతి గృహంలో విద్యార్థులు అవస్థల నడుమ చదువులు సాగిస్తున్నారు. కనీస వసతులకు వారంతా దూరంగా ఉన్నారు. ఇటీవలే రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని తన స్వగృహం వద్ద హోమం నిర్వహించిన మంత్రి అనిత, అలాగే కలెక్టర్ విజయకృష్ణన్ అక్కడకు వెళ్లి పరిశీలిస్తే తామేమి చేయాలో ఇట్టే అర్థమవుతుంది. పేద విద్యార్థులు నిత్యం పడుతున్న బాధలెంత తీవ్రంగా ఉన్నాయో తెలుస్తుంది. ప్రయివేటు మిగతా 2లో..



ప్లాట్ ఫారం సరిగా లేని బోరు



నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు



సమీక్షా సమావేశంలో పాల్గొన్న ఇన్‌ఛార్జి మంత్రి డోలా, ఎంపీ శ్రీభరత్, అధికారులు

విశాఖ ఖ్యాతిని పెంచేలా అభివృద్ధి ప్రణాళికలు

- జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి
- వివిధ అంశాలపై అధికారులతో సమీక్ష

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

విశాఖపట్నం మహా నగరం ఖ్యాతిని మరింత పెంచేలా అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలని, సరైన కార్యాచరణతో ముందుకెళ్లాలని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి పేర్కొన్నారు. నగరంలో కాలుష్య నివారణకు తగిన మార్గాలను అన్వేషిస్తూ పరిశోధనలు చేసి, నిబంధనలను కఠినతరం చేయాల్సిన ఆవశ్యకత ఉందని పేర్కొన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా ఆయన విశాఖపట్నం జిల్లా అధికారులతో కలెక్టరేట్ మీటింగు హాలులో శుక్రవారం సాయంత్రం భేటీ అయ్యారు. పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ జిల్లాలోని వివిధ అంశాలపై సుదీర్ఘంగా సమీక్షించామని, ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పని చేసి మంచి పేరు తీసుకురావాల్సిన బాధ్యత అధికారులపై ఉందని మంత్రి ఈ సందర్భంగా అన్నారు. తమది ఉద్యోగుల ఫ్రెండ్లీ ప్రభుత్వమని అన్నారు. ఎక్కువగా సైక్లోన్లు వచ్చే మిగతా 2లో..

బిఎస్‌ఎన్‌ఎల్‌లో వేతన సవరణ చేయాలి

వార్త 2లో..

పెరిగిన ధరలపై 1 నుంచి ఆందోళనలు


వార్త 5లో..

ఉత్తరాంధ్ర నీటిపారుదల శాఖ సిఇగా రామగోపాల్

వార్త 2లో..

అసలు లేదు.. కొసర బేరమా..

- రెండో ఫర్నేస్ ప్రారంభిస్తే ఉత్పత్తి సాధ్యమా ?
- ఐరన్ ఓర్ రప్పించే ఏర్పాటెక్కడ ?
- సరికొత్త నాటకాల్లో స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం



ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'మింగ మెతుకు లేదుగానీ మీసాలకు సంపెంగ నూనె' రాసినట్టుంది విశాఖ స్టీల్ ప్లాంట్ యాజమాన్యం తీరు. ఐరన్ ఓర్ నిల్వలు ప్లాంట్‌లో దాదాపు నిండుకున్న పరిస్థితుల్లో రెండో బ్లాస్ట్ ఫర్నేస్‌ను ఈ నెల 28న సోమవారం నుంచి ప్రారంభించేందుకు సన్నాహాలు చేయడం దేన్ని సూచిస్తుందన్న ప్రశ్న ఇప్పుడు అందరిలో మెదులుతోంది. ఐరన్ ఓర్ నిల్వల్లో కేవలం 4 లక్షల టన్నులు మాత్రమే ప్రస్తుతం నిల్వ ఉన్నాయి. బిఎఫ్ ప్రారంభమైతే కొద్దిరోజుల్లో అవి అయిపోయే అవకాశాలున్నాయి. అలాగే బొగ్గుకు సంబంధించి 1.36 లక్షల టన్నులు ఆర్ఎంహెచ్‌పిలోనూ, మరో 2 లక్షల టన్నులు గంగవరం పోర్టులోనూ ఉంది. దీనికి ఇంకా అదనంగా ఐరన్ ఓర్ అవసరం. కేంద్ర మంత్రి చెప్పినా ఐరన్ ఓర్‌ను ఎన్ఎండిసి సరఫరా చేయడం లేదు. కేంద్రం ఒక పక్క సహాయ నిరాకరణను ప్లాంట్‌పై అమలు చేస్తూ ఉంది. కార్మికులు మూడున్నరేళ్లుగా పోరాడుతున్న క్రమంలో ప్రస్తుతం ఉద్యమాన్ని తీవ్రం చేస్తున్న దశలో తూతూ మంత్రంగా బ్లాస్ట్ ఫర్నేస్‌ను పున:ప్రారంభించేందుకు యాజ మాన్యం సన్నాహాలు చేస్తోంది. మూడు బ్లాస్ట్ ఫర్నేస్‌లను ప్రారంభించి మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

ఆరు గదులకు ఒకటే ఫ్యాన్

విద్యా సంస్థల్లో ఫీజులు కట్టే స్థోమత, ప్రత్యేక వాహనాల్లో పిల్లలను పంపించే శక్తిలేని బీద కుటుంబాలవారు తమ పిల్లలను వసతి గృహాల్లో చేర్చుతున్నారు. అటువంటి కుటుంబాల పిల్లల బాగోగులపై కనీస శ్రద్ధ ప్రభుత్వ యంత్రాంగానికి వున్నట్లులేదు.

నక్కపల్లి ఎస్‌సి బాలుర వసతి గృహంలో ఐదు నుంచి పది తరగతుల విద్యార్థులు 56 మంది ఉన్నారు. ఆరు గదుల్లో ఒక్క గదిలో మాత్రమే ఫ్యాన్ ఉంది. బల్బు వెలుగుతోంది. మిగిలిన ఐదు గదులకు కొంతకాలంగా కరెంట్ లేదు. ఫ్యాన్, కరెంట్‌లేక తమకు కేటాయించిన గదుల్లో చదువుకొని పడుకోవాల్సిన పిల్లలు ఒక్క ఫ్యాన్, బల్బు పనిచేస్తున్న గదిలో సర్దుకొని పడుకుంటున్నారు. దోమలు కుట్టడంతో నిద్ర సరిగా వారికి వుండడంలేదు. వసతి గృహ భవనం మరమ్మతులకు గురవడంతో వర్షాలకు నీరు గదుల్లోకి చిమ్ముతోంది. విద్యార్థుల గది చీకటి, తడితో ఉంటోంది. స్నానాల గదుల్లేక, సరిపడా నీరులేక పైనున్న వాటర్ ట్యాంక్ నీరు బకెట్లతో పట్టుకొని భవనంపైనే స్నానాలు చేస్తున్నారు. ఒక్క బోరు దగ్గర 56 మంది విద్యార్థులు స్నానం చేసుకొనేందుకు సమయం సరిపోక కొంతమంది స్నానం చేయకుండానే బడులకు వెళ్తున్నట్లు విద్యార్థులు తెలిపారు. భోజన గదిలేకపోవడంతో వసతి గృహం ప్రాంగణంలోని బోరు దగ్గరకు వెళ్లి ప్లేట్లు కడుక్కొంటున్నారు. వర్షం పడితే తడిచిపోతున్నామని వాపోయారు.

పది మరుగు దొడ్లులో ఏ ఒక్కటీ వినియోగించడానికి వీల్లేనంత భయంకరంగా వున్నాయి. నాలుగు మరుగుదొడ్లకు తలుపులే లేవు. మరుగుదొడ్డికి డబ్బాలు, మగ్గులతో నీరుపట్టుకొని బహిరంగ ప్రదేశాలకు విద్యార్థులు వెళ్తున్నారు. రాత్రిపూట పాములు కన్పిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వసతి గృహం వెనుక భాగంలో ప్రహరీగోడ లేక పందులు వస్తున్నాయి. పాములు తిరుగుతున్నాయి. రాత్రి పూట తాగుబోతులు వస్తున్నారు. తాగునీరు లేక చప్పగావున్న బోరు నీరు తాగుతున్నట్లు విద్యార్థులు ప్రజాశక్తికి చెప్పారు. బట్టలు ఉతుక్కోవడానికి సరిపడా నీరులేదు. ఈ సమస్యలు ఒక్కరోజు, రెండ్రోజులుగా లేవు. అనేక నెలల నుంచి కొనసాగుతున్నాయి. అయినా ఎమ్మెల్యే, ఎంపీ, ప్రభుత్వ యంత్రాంగానికి పేద విద్యార్థుల బాధలు పట్టడంలేదు. చదువుకోవాల్సిన పిల్లలకు కనీస సదుపాయాలు కల్పించాలన్న ఆలోచన వారికి రావడంలేదు. తాగునీరు, మరుగుదొడ్లు, ఎలక్ట్రిసిటీ, భవన మరమ్మతులు, ఫ్లంబింగ్ ప్రహరీ తదితర పనుల కోసం రూ.25 లక్షలతో ప్రతిపాదనలు పంపినట్లు వార్డెన్ శ్రీనివాసరావు తెలిపారు. ప్రతిపాదనలు పంపించి నెలలు గడుస్తున్నా ఇంతవరకు పేద పిల్లల బాధలను ప్రభుత్వం తీర్చలేదు.

విశాఖ ఖ్యాతిని పెంచేలా అభివృద్ధి ప్రణాళికలు

ప్రాంతం కాబట్టి విశాఖ మహా నగరం పరిరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. ఇప్పటికే విభిన్న ప్రతిభావంతుల కోసం 25 ఎకరాల్లో క్రీడా మైదానం ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. దీని కోసం రూ.200 కోట్లు కేటాయించామని అన్నారు.

అంతకు ముందు నిర్వహించిన సమావేశంలో భాగంగా జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ జిల్లాలో చేపట్టబోయే ప్రాజెక్టులు, జిల్లా స్థితిగతుల గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ప్రభుత్వ విధానాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ ప్రజెంటేషన్ ఇస్తూ జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణకు వినూత్న చర్యలు చేపడుతున్నామని, దానిలో భాగంగా గస్తీ పెంచామని, డ్రోన్లను వినియోగిస్తున్నామని చెప్పారు. సాంకేతిక పరిజ్ఞానం సాయంతో సైబర్ నేరాలను అదుపు చేశామని, చాలా అంశాల్లో మంచి ఫలితాలు సాధించామని వివరించారు. విఎంఆర్‌డిఎ కమిషనర్ కెఎస్.విశ్వనాథన్ మాస్టర్ ప్లాన్‌పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. జిఎంఆర్ గ్రూప్ ప్రతినిధులు ఇచ్చిన ప్రజెంటేషన్‌లో విశాఖపట్నం నుంచి భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకునేందుకు సులువుగా ఉండేలా రోడ్లను అభివృద్ధి చేయాలని కోరారు. లంకెలపాలెం నుంచి తగరపువలస వరకు 12 ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ అంతరాయం కలుగుతోందని, ఆయా చోట్ల ఫ్లై ఓవర్లు వేయాల్సి ఉందని ప్రతిపాదించారు. ఎంపీ శ్రీభరత్ స్పందిస్తూ ప్రస్తుత జాతీయ రహదారిని విస్తరించాలంటే మెట్రో ప్రాజెక్టు కారిడార్ ఓ కొలిక్కి రావాలని, అప్పుడే సమాంతరంగా పనులు సాధ్యమని అభిప్రాయపడ్డారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జిల్లా రెవెన్యూ అధికారి కె.మోహన్ కుమార్, ఆర్‌డిఒలు పి.శ్రీలేఖ, సంగీత్ మాథుర్, వివిధ విభాగాల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

అసలు లేదు.. కొసర బేరమా..

ఉత్పత్తి సామర్థ్యాన్ని అందుకునేలాగ ప్లాంట్‌లో చర్యలు చేపట్టాలని కార్మికులు, విశాఖ ప్రజానీకం నెలల తరబడి డిమాండ్ చేస్తున్నా పాలకులకు పట్టడం లేదు. టిడిపి కూటమి పాలకులు వచ్చి ఐదు నెలలవుతున్నా సరైన రీతిలో నిర్ణయాలు చేయలేదు.

విద్యుత్ బిల్లుల మోత

విశాఖ స్టీల్‌ప్లాంట్ అనేక ఒడిదుడుకుల కారణంగా ఇప్పటివరకూ రూ.124 కోట్లు మేర విద్యుత్ బోర్డుకు బకాయి పడడంతో ఫీజులు పీకేస్తామంటూ అధికారులు బెదిరిస్తున్నారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వాన్ని ఈ ఆరు నెలల పాటు బకాయిలు చెల్లించేందుకు వ్యవధి కావాలని కార్మికవర్గం డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వం విద్యుత్ ఛార్జీల బకాయి విషయంలో సరైన చర్యలు తీసుకోలేదు.

అలాగే ఉన్న ఫలంగా ప్లాంట్ మనుగడ కోసం రూ.2 వేల కోట్ల విలువైన స్టీల్‌ను అడ్వాన్స్‌గా కొనుగోలు చేసి ప్రభుత్వం ఇవ్వాలన్న డిమాండ్ కార్మికవర్గం నుంచి వినిపిస్తోంది. స్టీల్‌ప్లాంట్ సిఐటియు నాయకులు జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ మూడు సంవత్సరాల పాటు రాష్ట్ర ప్రభుత్వం ట్యాక్స్ హాలిడే కూడా పై వాటితో పాటు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పై చర్యలేవీ తీసుకోకుండా తూతూ మంత్రంగా ప్లాంట్‌లోని బ్లాస్ట్ ఫర్నేస్‌ను ప్రారంభించడం వల్ల ఏం లాభమని ప్రశ్నిస్తున్నారు.

బిఎస్‌ఎన్‌ఎల్‌లో వేతన సవరణ చేయాలి



నిరసన తెలుపుతున్న బిఎస్‌ఎన్‌ఎల్ ఉద్యోగులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : బిఎస్‌ఎన్‌ఎల్‌లో వెంటనే వేతన సవరణ, పెన్షన్ సవరణ చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం బిఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం వద్ద బిఎస్‌ఎన్‌ఎల్ కో-ఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. సిఐటియు నాయకులు కెఎం.కుమార మంగళం, బిఎస్‌ఎన్‌ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు రామాంజనేయులు మాట్లాడుతూ బిఎస్‌ఎన్‌ఎల్‌కు సంబంధించి 4జి, 5జి సేవలను వెంటనే ప్రారంభించాలన్నారు. కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇపిఎస్, ఇఎస్‌ఐ భద్రతకు యాజమాన్యం బాధ్యత వహించాలన్నారు. కార్యక్రమంలో డిపిఎ.మూర్తి, లక్ష్మీనారాయణ, గోవిందరావు, శ్యామల, చక్రి పాల్గొన్నారు.

జిల్లా గ్రంథాలయ సంస్థ స్థలంలో..

అత్యాధునిక భవనం నిర్మిస్తాం


ఎంపీ శ్రీభరత్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జగదాంబకు ఎదురుగా ఉన్న దండు బజార్ ప్రాంతంలో జిల్లా గ్రంథాలయ సంస్థకు ఉన్న ఎకరా స్థలంలో అత్యాధునిక భవనం నిర్మిస్తామని విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్ హామీ ఇచ్చారు. అందుకు సంబంధించిన పనిని వేగిర పరచడానికి కృషి చేస్తానన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పి.మల్లేశ్వరరావు, ఉపాధ్యక్షులు కె.త్రిమూర్తులు ఎంపీ శ్రీ భరత్‌ను ఆయన కార్యాలయంలో కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా శ్రీ భరత్ మాట్లాడుతూ రాష్ట్ర విద్య, గ్రంథాలయాల శాఖ మంత్రి లోకేష్‌తో మాట్లాడి గ్రంథాలయ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తానన్నారు. గ్రంథాలయాల అభివృద్ధికి మంత్రి లోకేష్ సానుకూలంగా ఉన్నారని తెలిపారు. ఉద్యోగులు చిత్తశుద్ధితో, సేవాభావంతో పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలన్నారు.

మెడికవర్‌లో రోబోటిక్ శస్త్రచికిత్స విజయవంతం


తల్లీబిడ్డతో వైద్య బృందం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా బలహీనమైన గర్భాశయం ఉన్న మహిళకు రోబోటిక్ అబ్డామినల్ సెర్క్లేజ్ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించినట్టు మెడికవర్ హాస్పిటల్స్ వైద్యులు డాక్టర్ కిరణ్మయి గొట్టాపు తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖపట్నం పరిసర ప్రాంతానికి చెందిన 34 సంవత్సరాల మహిళకు గతంలో ఆరు సార్లు అబార్షన్లు జరిగాయి. రెటినోపతితో బాధపడుతూ ప్రీమెచ్యూరిటీ ప్రసవం జరిగింది. తద్వారా రోగికి గర్భాశయ లోపం తలెత్తింది. ఇది గతంలో అనేక గర్భధారణ నష్టాలకు దారితీసింది. ఈ నేపథ్యంలో డాక్టర్ కిరణ్మయి గొట్టాపు నేతృత్వంలోని వైద్య బృందం సమస్యను పరిష్కరించడానికి ఇన్వాసివ్ రోబోటిక్ - సహాయక అబ్డామినల్ సర్క్లేజ్‌ను ఎంచుకుంది. ఈ ప్రక్రియ తర్వాత గర్భం సజావుగా నిర్వహించడంతో మెడికవర్ హాస్పిటల్స్‌లో ఆరోగ్యకరమైన బిడ్డకు తల్లి జన్మనిచ్చింది. శస్త్ర చికిత్స తీరును కిరణ్మయి వివరించారు.


బోర్డు రూంను ప్రారంభిస్తున్న అంగముత్తు

ఘనంగా పోర్టు ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం పోర్టు 91వ ఆవిర్భావ దినోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పోర్టు పరిపాలనా భవనంలో ఆధునికీకరించిన బోర్డు రూంను ఛైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు చేతుల మీదుగా ప్రారంభించారు. దీనికి వైజాగ్ పటంగా నామకరణం చేశారు. అనంతరం 91వ అవిర్భావ దినోత్సవ కార్యక్రమాన్ని పరిపాలనా భవనంలోని సాంబమూర్తి ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అంగముత్తు మాట్లాడుతూ పోర్టు ప్రగతిని వివరించారు. గత ఆర్థిక సంవత్సరంలో 81.09 మిలియన్ మెట్రిక్ టన్నుల సరుకు రవాణా చేసి నూతన రికార్డును నెలకొల్పిందని, ఈ ఏడాది 90 మిలియన్ మెట్రిక్ టన్నులను లక్ష్యంగా చేసుకుని దానిని సాధించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో పోర్టు డిప్యూటీ ఛైర్మన్ దుర్గేష్ కుమార్ దూబె, పిఎస్ఎల్.స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉక్కుపై 1న స్టూడెంట్ కన్వెన్షన్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని, అలాగే కడపలో స్టీల్‌ప్లాంట్ నిర్మించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర స్థాయి స్టూడెంట్ కన్వెన్షన్‌ను నవంబర్ 1న విశాఖ డాబాగార్డెన్స్‌లోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో నిర్వహించనున్నట్టు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎల్‌జె.నాయుడు తెలిపారు. ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్, పిడిఎస్‌యు, పిడిఎస్ఒ, ఎఐడిఎస్ఒ, డివైఎఫ్ఐ, ఎఐవైఎఫ్ విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో ఈ సదస్సు జరుగుతుందన్నారు. ఈ మేరకు నగరంలో శుక్రవారం చేపట్టిన పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో వివిధ విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

1307వ రోజుకు జెఎసి దీక్షలు

స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ, జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన రిలేదీక్షలు శుక్రవారానికి 1307వ రోజుకు చేరాయి. దీక్షల్లో సిఐటియు కంచరపాలెం జోన్ అధ్యక్షులు ఒ.అప్పారావు, ఎం.ఈశ్వరరావు, కె.లక్ష్మణరావు, వి.వరప్రసాదరావు, బి.గంగరాజు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర నీటిపారుదల శాఖ సిఇగా రామగోపాల్

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

ఉత్తరాంధ్ర నీటిపారుదల శాఖ ఛీఫ్ ఇంజినీర్‌గా డి.రామగోపాల్‌ను ప్రభుత్వం నియమించింది. కర్నూలులోని హెచ్‌ఎన్ఎస్-ఎస్ సర్కిల్-1 సూపరింటెండెంట్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న ఆయనను ఉద్యోగోన్నతిపై ఇక్కడకు సిఇగా బదిలీ చేసింది. నీటి పారుదలశాఖ విశాఖపట్నం సర్కిల్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ఎస్.సుగుణాకరరావును విజయవాడ ఐఎస్ అండ్ డబ్ల్యుఆర్ ఛీఫ్ ఇంజినీర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసింది.

27న బీచ్‌లో లేజర్ షో

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జివిఎంసిలో స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో భాగంగా ఈ నెల 27న సాయంత్రం 7 గంటల నుంచి బీచ్ రోడ్డులోని వైఎంసిఎ సమీపానగల 'విక్టరీ ఎట్ సీ' స్తూపంపై సౌండ్, లేజర్ షో ఉంటుందని జివిఎంసి ప్రధాన ఇంజనీరు పి.శివప్రసాద్ రాజు శుక్రవారం తెలిపారు.

యువకున్ని బలిగొన్న బిఎన్ రోడ్డు

- గతుకుల రహదారిలో బైక్ బోల్తా పడి మృతి
- ఏళ్ల తరబడి మరమ్మతు చేపట్టని అధికారులు


కోట దొరబాబు (ఫైల్)

ప్రజాశక్తి-రోలుగుంట: ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోక, రోలుగుంట సమీపంలో అధ్వానంగా తయారైన భీమునిపట్నం- నర్సీపట్నం (బిఎన్) రోడ్డు శుక్రవారం సాయంత్రం ఓ యువకుని నిండుప్రాణాన్ని బలితీసుకుంది. నక్కపల్లిలో శుభ కార్యక్రమానికి హాజరై నర్సీపట్నం నుంచి ద్విచక్రవాహనంపై కొత్తకోట వైపు వస్తుండగా, రోలుగుంట సమీపంలోని కొత్తచెరువు మలుపు వద్ద వాహనం అదుపు తప్పడంతో రోడ్డు పై వాహనంతో సహ బోల్తా పడ్డాడు. ఈ సంఘటనపై రోలుగుంట పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రావికమతం మండలం కొత్తకోట గ్రామానికి చెందిన కోట దొరబాబు అదే గ్రామంలో ఓ చిన్న వ్యాపారి. శుక్రవారం తన బంధువులు నక్కపల్లిలో గృహ ప్రవేశం చేశారు, ఆ శుభ కార్యక్రమంనకు హాజరై సాయంత్రం ద్విచక్ర వానంపై వస్తుండగా రోడ్డు మధ్యలో ఏర్పడ్డ గుంతలను తప్పించ బోయి మృతుడు దొరబాబు పయనిస్తున్న ద్విచక్రవాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ముఖం, తల భాగాలకు బలమైన గాయాల య్యాయి. ప్రమాద స్థలం లోనే దొరబాబు చాలాసేపు కొన ఊపిరితో ఉన్నాడని, సకాలంలో వైద్య సేవలు అందక మృతి చెందాడని స్థానికులు చెబుతున్నారు. సమాచారం తెలుసుకున్న రోలుగుంట పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి ఇద్దరు పిల్లలు, భార్య, తల్లి ఉన్నారు.

సామాజిక సమస్యగా సైబర్ సెక్యూరిటీ


మౌతన్ సర్కార్‌ను సత్కరిస్తున్న గీతం ప్రతినిధులు

ప్రజాశక్తి -మధురవాడ : డిజిటల్ యుగంలో ఇంటర్‌నెట్ వినియోగం గణనీయంగా పెరగడంతో వ్యక్తిగత సమాచారం ప్రమాదంలో పడుతోందని, ఆర్థిక నేరాలు పెరుగుతూ, చివరికి సైబర్ సెక్యూరిటి సామాజిక సమస్యగా మారిందని టాటా కన్సల్టెన్సీ సైబర్ సెక్యూరిటి నిపుణులు మౌతన్ సర్కార్ అభిప్రాయపడ్డారు. శుక్రవారం గీతం కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహనలో ఆన్‌లైన్ మోసాలు, వ్యక్తిగత సమాచార భద్రత వంటి అంశాలను వివరించారు. సైబర్ ఫోరెన్సిక్స్ ప్రాధాన్యతను తెలిపారు. గీతం స్కూల్ ఆఫ్ టెక్నాలజీ డైరెక్టర్ ప్రొఫెసర్ కె.నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ సైబర్ నేరాలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండటంతో పాటు ప్రజలలో చైతన్యం, అవగాహన కల్పించాలన్నారు. సిఎస్ఇ విభాగాధిపతి డాక్టర్ జి.లక్ష్మీశ్వరి సైబర్ నేరాలను అరికట్టే నిపుణులుగా యువత తయారు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమానికి డాక్టర్ గురుప్రీత్‌సింగ్ సంధానకర్తగా వ్యవహరించారు.

హెచ్‌ఎస్‌ఎల్‌లో గ్రీన్ హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్స్ ప్రారంభం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : హిందుస్థాన్ షిప్ యార్డ్ లిమిటెడ్ దేశ గ్రీన్ హైడ్రోజన్ మిషన్‌కు అనుగుణంగా ప్రముఖ కొరియా ఫ్యూయల్ సెల్ టెక్నాలజీ అసోసియేట్, ఇండియన్ ఇండస్ట్రీ భాగస్వామి లోటస్ వైర్లెస్ ప్రైవేట్ లిమిటెడ్‌తో కలిసి భారత సముద్ర రంగానికి అవసరమైన అత్యాధునిక గ్రీన్ హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ టెక్నాలజీని ప్రారంభించింది. 250 కిలోవాట్ల నుంచి 2 మెగావాట్ల వరకు ఉండే ఈ హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్స్ పూర్తిగా క్లాస్ సర్టిఫైడ్. ఇది వివిధ సముద్ర అనువర్తనాలకు కొలుస్తుంది. సంప్రదాయ డీజిల్ ఆధారిత వ్యవస్థలకు సుస్థిర ప్రత్యామ్నాయాన్ని అందించడం ద్వారా ఈ అధునాతన ఇంధన కణాలు భారత సముద్ర రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురానున్నాయి.

200 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక అవంతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ సైన్సెస్ ఆధ్వర్యంలో శుక్రవారం భీమిలి మండలం, రేఖవానిపాలెం పంచాయతీ కార్యాలయం వద్ద ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వివిధ విభాగాల వైద్యనిపుణులు పాల్గొని,200 మంది రోగులకు వైద్యసేవలు అందించారు. ఎన్ఎస్ఎస్ విభాగం వాలంటీర్లు సహకరించారు.కార్యక్రమంలో సర్పంచ్ సమ్మిడి శ్రీనివాసరావు, కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ డాక్టర్ ఎంబివి రాజు, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఉమాశంకర్, ఎన్ఎస్ఎస్ సమన్వయ కర్త రుషి పాల్గొన్నారు

ఉచిత కంప్యూటర్ శిక్షణ

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక కలిగొట్ల స్విర్ల శ్రీదేవి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఫౌండేషన్ కార్యాలయం వద్ద 9వ బ్యాచ్ ఉచిత కంప్యూటర్ శిక్షణ తరగతులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ తరగతులను ఫౌండేషన్ చైర్మన్ కె శ్రీరామచంద్రమూర్తి ప్రారంభించారు. టెన్త్ పూర్తయిన పేద విద్యార్థినులు ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలనికోరారు.

బిపి.కల్లాలు రోడ్డులో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి -ఆనందపురం: మండలంలో బంటుపల్లి గ్రామపంచాయతీ సిఎస్‌బి బ్యాంక్, పరిసర షాపుల వద్ద శుక్రవారం గ్రామపంచాయతీ సిబ్బంది పారిశుధ్య పనులు చేపట్టారు. మురుగుతో దుర్గంధం శీర్షికతో వెలువడిన కథనంపై గ్రామపంచాయతీ అధికారులు స్పందించారు. బిపి.కల్లాలు రోడ్డులో దుకాణాల సమీపంలోకి కాలువలను శుభ్రపరచి బ్లీచింగ్ చల్లారు. అయితే మురుగునీరు పోయేలా చర్యలు చేపట్టలేదని షాపు యజమానులు అంటున్నారు.

'ముమ్మన' చేరికపై కూటమి శ్రేణులు గరం గరం


సుజాతనగర్‌లో ప్లకార్డులతో టిడిపి శ్రేణుల నిరసన

ప్రజాశక్తి-పెందుర్తి: జివిఎంసి 95వ వార్డు వైసిపి కార్పొరేటర్ ముమ్మన దేముడు ఈనెల 26న ఎంపి సిఎం రమేష్ సమక్షంలో బిజెపిలో చేరికపై కూటమి శ్రేణులు అసహనం, ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. శుక్రవారం సుజాతనగర్‌లోని ప్రైవేట్ కళ్యాణ మండపంలో వార్డు టిడిపి అధ్యక్షుడు దాట్ల మధు, జనసేన ధ్వక్షుడు సేనాపతి సోమశేఖరనాయుడు, గల్లా వెంకటరమణ కనకదేవుడు జనసేన నేత పార్వతి తదితరులు ఆధ్వర్యంలో ప్లకార్డులు పట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. కూటమి విజయానికి కష్టబడిన మూడు పార్టీల కేడర్ మూకుమ్మడిగా దేముడు చేరికను వ్యతిరేకిస్తుంటే, ఎలాచేర్చుకుంటారని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే జెర్రి పోతులపాలెంలో కొంతమంది వైసిపి నేతలు టిడిపిలో చేరికపై రెండు పంచాయతీల కూటమి శ్రేణులు అధిష్టానానికి ఫిర్యాదుతోపాటు అలకబూని ఉన్నారు. ఇపుడు ఏకంగా స్థానిక కూటమి శ్రేణుల ప్రమేయం లేకుండా నేరుగా ఎంపి సిఎం రమేష్‌తో మాట్లాడి, ఈ నెల 26న బిజెపిలో చేరికకు సన్నద్ధం కావడంతో మండిపడుతున్నారు. ఇప్పటికే ప్రజారాజ్యం, కాంగ్రెస్, టిడిపి, వైసిపి, ఇలా అన్ని పార్టీల్లోనూ చేరి, అనేక అవినీతి ఆరోపణలు, అవకాశవాద రాజకీయాలు చేస్తున్న దేముడు రాకను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేస్తున్నారు. స్థానిక కేడర్‌ను కాదని చేర్చుకుంటే భవిష్యత్ పరిణామాలకు బాధ్యత మూడు పార్టీల అధిష్టానాలదేనని హెచ్చరిస్తున్నారు.

కోయంబత్తూరు - బరౌని మధ్య ప్రత్యేక రైళ్లు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ.:ప్రయాణీకుల రద్దీని క్లియర్ చేయడానికి కోయంబత్తూర్ - బరౌని మధ్య ప్రత్యేక రైలును నడపాలని రైల్వే శాఖ నిర్ణయించింది. ఈ క్రమంలో రైలు నెంబరు 06055 కోయంబత్తూరు – బరౌని ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ ఈనెల 26 నుండి నవంబర్ 16 వరకు ప్రతి శనివారం ఉదయం 11.50 గంటలకు కోయంబత్తూరులో బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 10.48 గంటలకు దువ్వాడ చేరుకుని, మరల 10:50 గంటలకు బయలుదేరి మూడవరోజు సోమవారం మధ్యాహ్నం 14:30 గంటలకు బరౌని చేరుకుంటుంది. 06056 బరౌని – కోయంబత్తూరు ప్రత్యేక రైలు ఈనెల 29 నుంచి నవంబర్ 19 వరకు ప్రతి మంగళవారం రాత్రి 23.45 గంటలకు బరౌని నుండి బయలుదేరి, రెండవ రోజు బుధవారం తెల్లవారుజామున 3.48 గంటలకు దువ్వాడ చేరుకుని, మరల 3:50 గంటలకు బయలుదేరి శుక్రవారం తెల్లవారుజామున 3.45 గంటలకు కోయంబత్తూరు చేరుకుంటుంది. ఈ రైళ్లు తిరుప్పూర్, ఈరోడ్, సేలం, జోలార్‌పేటై, కాట్పాడి, పెరంబూర్, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, దువ్వాడ, విజయనగరం, బొబ్బిలి, పార్వతీపురం, రాయగడ, మునిగుడ, సూబల్‌గూరు, సమిట్లాపూర్, రొబలిగుడ, సమిట్లపూర్ హతియా, రాంచీ, మూరి, బొకారో స్టీల్‌సిటీ, ధనబాద్, బార్కర్, చిత్తతాంజన్, మధుపూర్, జసిద్, ఝూజా, కియుల్ మీదుగా ప్రయాణిస్తాయని ఈస్ట్‌కోస్ట్ రైల్వే సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు.

నాయకుల రచ్చతో గ్రామంలో చిచ్చు!

ప్రజాశక్తి-పెందుర్తి : నాయకుల మధ్య వైరం ఏకంగా ఊరికే ఇబ్బందికరంగా మారిన వైనం మండలంలోని జెర్రిపోతులపాలెంలో చోటుచేసుకుంది. గ్రామంలో దాదాపు 80 శాతం వరకు డిఫారం భూములే ఉన్నాయి. గతంలో వైసిపి మాజీ సర్పంచ్ కోన శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్మాణాలు జరగ్గా, వాటిపై చర్యలు తీసుకోవాలని అప్పట్లో ప్రస్తుత సర్పంచ్ మడక అప్పలరాజు అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేశారు. అప్పట్లో వైసిపి అధికారంలో ఉండడంతో అధికారులు స్పందించలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సర్పంచ్ మడక అప్పలరాజు ఇటీవల వాణిజ్య భవన నిర్మాణానికి పూనుకున్నాడు. మాజీ సర్పంచ్ కోన శీను ఫిర్యాదుతో ఆ భవన నిర్మాణాన్ని అధికారులు ఆపేశారు. వీరిరువురి మధ్య తగాదా తీవ్రమై పోలీసుస్టేషన్ వరకు వెళ్లింది. దీంతో సమస్యను పరిష్కరించేందుకు శుక్రవారం తహశీల్దార్ ఆనందకుమార్ స్వయంగా రంగంలోకి దిగారు. గ్రామంలో ప్రస్తుతం జరుగుతున్న ప్రతి నిర్మాణాన్ని పరిశీలించి, వివరాలు సేకరించారు. దీంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నేతలిద్దరి గొడవతో అన్ని నిర్మాణాలపై అధికారులు సర్వే పేరుతో అభ్యంతరం చెబితే పరిస్థితి ఏంటని వాపోతున్నారు. కాగా వచ్చిన ఫిర్యాదుల మేరకే సమస్యను పరిష్కరిస్తామని అధికారులు అంటున్నా, స్థానికుల్లో గుబులు మొదలైంది.

నేరాలు ఘోరాలు

కత్తితో బెదిరించిన ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి - ఆరిలోవ : కత్తి చూపించి డబ్బులు తీసుకున్న ఇద్దరు యువకులను ఆరిలోవ పోలీసులు శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ద్వారకా నేరవిభాగం సిఐ బంగారు పాప తెలిపిన వివరాలివి. ఆరిలోవ సుందర్‌నగర్‌కు చెందిన కంట్రెడ్డి లిఖిత్, అతని స్నేహితుడు దొడ్డి భానుకిరణ్ గురువారం సాయంత్రం జోడుగుళ్ళపాలెం వద్ద ఒక పాన్ షాపు వద్ద ఉండగా, ఇద్దరు గుర్తు తెలియని యువకులు వచ్చి సిగరెట్ ఇవ్వాలని అడిగారు. తమ వద్ద లేవని లిఖిత్, భానుకిరణ్ సమాధానం చెప్పగా,గుర్తు తెలియని ఇద్దరిలో ఒకరు లిఖిత్ జేబులో చెయ్యి పెట్టి డబ్బులు తీయబోయాడు. అది గమనించిన లిఖిత్ వారించే ప్రయత్నం చేయగా, ఆ వ్యక్తి తన జేబులోంచి చాకు తీసి లిఖిత్, భానుకిరణ్‌ను బెదిరించి, లిఖిత్ జేబులోంచి రూ 500లు పట్టుకొని పారిపోయారు. లిఖిత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఆరిలోవ పోలీసులు, విచారణ అనంతరం కత్తితో బెదిరించిన వ్యక్తులు ఆరిలోవ, అన్నానగర్‌కు చెందిన బండారు రాజు, బిఎన్ఆర్‌నగర్‌కు చెందిన కోడూరు కిరణ్‌గా గుర్తించి శుక్రవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిఐ తెలిపారు.

4 కిలోల గంజాయి స్వాధీనం

ప్రజాశక్తి- నాతవరం :మండలంలోని తాండవ జంక్షన్ వద్ద నాతవరం ఎస్ఐ సిహెచ్ భీమరాజు ఆధ్వర్యంలో శుక్రవారం వాహన తనిఖీలు చేపట్టారు. నర్సీపట్నం నుంచి తుని వెళ్తున్న ఆర్‌టిసి బస్సు నుంచి ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా దిగి వెళుతుండగా పోలీసులు గమనించారు. వారిని పట్టుకుని తనిఖీ చేయగా, వారి వద్ద నాలుగు కేజీల గంజాయి దొరికినట్లు ఎస్ఐ తెలిపారు. ముగ్గురిని అరెస్ట్ చేసి, రెండు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

బాలిక పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై ఫోక్సో కేసు

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలో కుమారపురం గ్రామానికి చెందిన బాలికపై అదే గ్రామానికి చెందిన రెడ్డి అశోక్ అనే యువకుడు అసభ్యకరంగా ప్రవర్తించినందుకు బాధిత తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సిఐ నమ్మి గణేష్ తెలిపారు. ఈనెల 19న రాత్రి 9 గంటల సమయంలో అశోక్ బాలిక చెయ్యి పట్టుకొని బలవంతంగా షెడ్ వద్దకు తీసుకువెళ్లి బాలిక చాతిపై చెయ్యి వేసి అసభ్యకరంగా ప్రవర్తించాడని బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఫోక్సో యాక్ట్ ద్వారా కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు.

మోసం చేసిన మేనేజర్‌పై చర్యలు తీసుకోండి

ప్రజాశక్తి-సీతమ్మధార : హార్బర్ ఎసిపి సస్పెన్షన్‌తో ప్రమేయమున్న యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ దయాకర్ మోసాలపై చర్యలు తీసుకుని తనకు న్యాయం చేయాలని అతని చేతిలో మోసపోయిన ఖాతాదారుడు అంకమ్మ చౌదరి కోరారు. శుక్రవారం పౌర గ్రంథాలయంలో మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. గుంటూరు, పసుమర్రు యూనియన్ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్‌గాఉన్నప్పుడు తనను మోసపుచ్చిన దయాకర్, ఇపుడు వన్‌టౌన్ రికవరీ సెక్షన్ సీనియర్ మేనేజర్‌గా వచ్చాడన్నారు. దీనిపై సిపి, డిజిపిలకు ఫిర్యాదు చేశానన్నాడు. న్యాయం జరగకుంటే కోర్టును ఆశ్రయిస్తానని స్పష్టం చేశాడు. మరో బాధితుడు శ్రీకాంత్ ఉన్నారు.

తుక్కు దుకాణంలో అగ్నిప్రమాదం

ప్రజాశక్తి-గాజువాక : జివిఎంసి 64వ వార్డు సత్యనారాయణపురంలోని తుక్కు దుకాణంలో శుక్రవారం సాయంత్రం అగ్నిప్రమాదం జరిగింది. ఘటనలో పాత ప్లాస్టిక్ సామాన్లు, అట్టపెట్టెలు కాలి బూడిదయ్యాయి. గంగవరం గ్రామానికి వెళ్లే రహదారిలో సత్యనారాయణపురం దరి స్క్రాప్ దుకాణంలో విద్యుత్ వైర్లు రాపిడితో నిప్పులు పడడంతో మంటలు చెలరేగాయి. దీంతో స్క్రాప్ దుకాణంలోని ప్లాస్టిక్‌తో పాటు, అట్టపెట్టెలు కాలిబూడిదయ్యాయి. దగ్గర్లో ఉన్న ఫైర్ సిబ్బంది చేరుకొని మంటలను అదుపు చేశారు.

స్క్రాప్ దుకాణంలో రేగిన మంటలు


గీతంలో ముగిసిన అంతర్జాతీయ సదస్సు


ముగింపు సభలో అతిథులకు జ్ఞాపికలతో సత్కారం

ప్రజాశక్తి -మధురవాడ : ఇండో పసిఫిక్ ప్రాంతంలో మారుతున్న రాజకీయ, ఆర్థిక సమీకరణాలు భద్రతా అంశాలపై గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ సదస్సు శుక్రవారం ముగిసింది. గీతం వర్సిటీ స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్, జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం (న్యూఢిల్లీ), సెంటర్ ఫర్ ఈస్ట్ ఏషియన్ స్టడీస్, తైవాన్‌కు చెందిన ఎకనామిక్ అండ్ కల్చరల్ సెంటర్ సంయుక్త ఆధ్వర్యాన నిర్వహించిన సదస్సులో అంతర్జాతీయ ఆర్థిక, రాజకీయ పరిణామాలు, ఆసియా పసిఫిక్ ప్రాంతంలో వాటి ప్రభావంపై నిపుణులు చర్చించారు. తైవాన్‌కు చెందిన ఎకనామిక్ అండ్ కల్చరల్ సెంటర్ అధికారిక ప్రతినిధి రాబర్ట్ హిష్ మాట్లాడుతూ తైవాన్ చిన్న దేశమైనా, విద్య, ఆరోగ్య, వాణిజ్యరంగాలలో ప్రపంచంలోనే అగ్రస్థానం ఉందన్నారు. అంతర్జాతీయ వాణిజ్యంలో తైవాన్ పాత్రను తగ్గించడానికి చైనా ఉద్దేశ్య పూర్వకంగా సమస్యలు సృష్టిస్తోందన్నారు. ఇతర ప్రపంచ దేశాలతో పాటు భారత్‌తో బలమైన వాణిజ్య సంబంధాలను తైవాన్ కొనసాగిస్తోందన్నారు. జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ శాంతిశ్రీ ధూళిపూడి పండిట్ మాట్లాడుతూ తైవాన్‌తో భారత్ సంబంధాలు భవిష్యత్తులో మరింతగా మెరుగు పడతాయన్నారు. గీతం ఆర్థిక శాస్త్ర విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మందర్ వి.కులకర్ణి మాట్లాడుతూ ఆసియా పసిఫిక్ దేశాలు ఆర్థికాభివృద్ధికి వివిధ కూటమిలలో పనిచేస్తున్న భారత్ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోందన్నారు. నేషనల్ మేరీటైం ఫౌండేషన్ నిపుణురాలు కె.దీపా బంగాళాఖాతంలో ఆర్థిక, పర్యావరణ అంశాల మధ్య భారత్ సమతుల్యత పాటిస్తూ ఆర్థిక శక్తిగా ఎదుగుతోందన్నారు. కార్యక్రమంలో సెంటర్ ఫర్ ఈస్ట్ ఏసియన్ స్టడీస్ చైర్‌పర్సన్ ప్రొఫెసర్ అల్కా ఆచార్య, గీతం వర్సిటీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్.సుబ్బరాజ్, దేశంలోని వివిధ వర్సిటీల నిపుణులు పాల్గొన్నారు.

పంచగ్రామాల భూసమస్యపై వినతి


ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుకు వినతిపత్రం ఇస్తున్న నేతలు

ప్రజాశక్తి-పెందుర్తి : పంచగ్రామాల భూసమస్యను పరిష్కరించాలని కోరుతూ పంచగ్రామాల కాలనీ అసోసియేషన్, పంచగ్రామాల భూకమిటీలు శుక్రవారం సమైక్య ప్రజా రైతు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఉత్తర ఎమ్మెల్యే పెనుమత్స విష్ణుకుమార్‌రాజును కలిసి వినతిపత్రం అందజేశారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో నిర్వహించే సమావేశంలో చర్చిస్తామన్నారు. అసెంబ్లీ సమావేశాల్లోనూ సమస్యపై ప్రస్తావిస్తామని, సమావేశాలకు ముందు ఒకసారి కలవాలని సూచించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు టివి.కృష్ణంరాజు, విబిఎన్.ప్రతాప్, ఉపాధ్యక్షులు బి .శంకరరావు, హనుమంత రావు, రాము, విజయకుమార్, బాలరాము పాల్గొన్నారు.

సుందర తీరంలో పుష్పవికాసం


సాగరతీరంలో పువ్వులతో నిండిన గుర్రపు డెక్క

ప్రజాశక్తి -మధురవాడ : జూపార్కు రుషికొండ సాగర తీరంలో జూ నుంచి సాగర్‌నగర్ రుషికొండ బీచ్ మధ్య ఉన్న అటవీ భూముల్లో వ్యాప్తి చెందిన గుర్రపుడెక్క పాదులకు వికసించిన పుష్పాలు చూపరులకు కనువిందు కలిగిస్తున్నాయి. బీచ్ రోడ్డు,సముద్రతీరానికి మధ్య వందలాది ఎకరాల అటవీ భూముల్లో ఏటా దీపావళి పండగ ముందు నుంచి సంక్రాంతి వరకు ఆహ్లాదకర రీతిలో ఈ పుష్పాలు వికసిస్తాయి. ఇవి సందర్శకులను అలరిస్తున్నాయి.

నేటి నుంచి రంజీ మ్యాచ్

హిమాచల్‌ప్రదేశ్‌తో తలపడనున్న ఆంధ్ర జట్టు
ఎసిఎ, విడిసిఎ స్టేడియంలో ఏర్పాట్లు పూర్తి


ప్రాక్టీస్ చేస్తున్న ఆంధ్రా రంజీ క్రికెటర్లు


ప్రజాశక్తి -మధురవాడ : పీఎం పాలెంలోని ఎసిఎ, విడిసిఎ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం వేదికగా హిమాచల్‌ప్రదేశ్‌తో ఆంధ్రా జట్టు రంజీ ట్రోఫీ మ్యాచ్ శనివారం నుంచి ప్రారంభం కానుంది. 29వ తేదీ వరకు రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు మ్యాచ్ నిర్వహణకు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. శుక్రవారం ఉదయం సెషన్‌లో ఆంధ్ర, మధ్యాహ్నం సెషన్‌లో హిమాచల్‌ప్రదేశ్ జట్లు నెట్స్‌లో ప్రాక్టీస్ చేశాయి. ఆంధ్రజట్టు కెప్టెన్ ఎస్.కె.రషీద్, టి.విజయ్, కె.ఎస్.భరత్, జి.హెచ్.విహారి, కె.మహీప్ కుమార్, ఎం.వంశీకృష్ణ, ఎం.అభిషేక్‌రెడ్డి, కె.వి.శశికాంత్, అశ్విన్‌హెబ్బర్, సిహెచ్ స్టీఫెన్, పి.సత్యనారాయణ రాజు, ఎ.లలిత్‌మోహన్, జి.మనీష్, ఎం.హేమంత్‌రెడ్డి, ఎస్ఎండి.రఫీ, కె.కరణ్ షిండే తదితరులు జిమ్‌లో ముమ్మరంగా సాధన చేశారు.

ఉచిత ప్రవేశం

ఎసిఎ, విడిసిఎ స్టేడియంలో జరగనున్న రంజీ మ్యాచ్‌ను తిలకించేందుకు క్రికెట్ అభిమానులకు ఉచిత ప్రవేశం కల్పిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. స్టేడియం వద్ద 15వ నంబర్ గేట్ నుంచి ఉచిత ప్రవేశం ఉంటుంది. ఉదయం 8 గంటల నుంచి స్టేడియంలోకి అనుమతిస్తారు.

నేడు వైజాగ్ కన్వెన్షన్‌లో ప్రసూతి, స్త్రీల వ్యాధులపై సదస్సు

ఒజిఎస్‌వి అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ వైఎల్.నరసింగరావు, డాక్టర్ కిరణ్మయి వెల్లడి



ప్రజాశక్తి-విశాఖపట్నం :విశాఖపట్టణం ఒబెస్ట్రిటిక్స్ అండ్ గైనకాలజికల్ సొసైటీ (ఒజిఎస్‌వి) 58వ వార్షిక కంటిన్యూయింగ్ మెడికల్ ఎడ్యుకేషన్ (సిఎంఇ) కార్యక్రమంలో భాగంగా వైజాగ్ కన్వెన్షన్స్‌లో ఈ నెల 26, 27 తేదీల్లో ప్రసూతి, స్త్రీల వ్యాధులపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు సొసైటీ అధ్యక్షులు డాక్టర్ వైఎల్ నరసింగరావు, కార్యదర్శి డాక్టర్ కిరణ్మయి గొట్టపు తెలిపారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ, వైద్య నిపుణులు తమ పరిజ్ఞానాన్ని పెంచుకోవడానికి, ప్రసూతి శాస్త్రం, గైనకాలజీ రంగంలో నూతన ఆవిష్కరణలను చర్చించడానికి సిఎంఇ కార్యక్రమం ఎంతో దోహదపడు తుందన్నారు. ఈ కార్యక్రమానికి దాదాపు 500 మంది గైనకాలజిస్టులు హాజరవు తారని తెలిపారు. ముఖ్య అతిథులుగా నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ, గౌరవ అతిథిగా ఫెడరేషన్ ఆఫ్ ఒబెస్ట్రిటిక్స్ అండ్ గైనకాలజికల్ సొసైటీస్ ఆఫ్ ఇండియా (ఎఫ్ఒజిఎస్ఐ) అధ్యక్షులు డాక్టర్ జయదీప్ టాంక్ హాజరవుతారని తెలిపారు. వైద్యులు సకాలంలో హాజరుకావాలని కోరారు. ఒజిఎస్‌వి పూర్వ అధ్యక్షులు డాక్టర్ శశిప్రభ, డాక్టర్ క్రిష్ణమ్మ, డాక్టర్ సుబ్బరాజు, డాక్టర్ రాధ, డాక్టర్ సీతారామరాజు తదితరులు పాల్గొన్నారు.

ఐటి సెజ్‌లో పోలీస్ అవుట్ పోస్ట్


పోలీస్ అవుట్‌పోస్ట్‌ను ప్రారంభిస్తున్న సిపి శంఖబ్రత బాగ్చీ

ప్రజాశక్తి -మధురవాడ: విశాఖ ఐటి సెజ్ లో పోలీస్ అవుట్ పోస్ట్‌ను శుక్రవారం నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ప్రారంభించారు. హిల్ నెంబర్ 2, సింబసిస్‌లో సిపి మాట్లాడుతూ అవుట్‌పోస్ట్‌లో 24□7 ప్రజలకు సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ఇక్కడ పెర్మనెంట్ సంస్థ పోలీస్ సబ్ కంట్రోల్ వసతి కంటైయినారు ఏర్పాటు చేసిందన్నారు సెజ్‌లోని తుప్పలను తొలగించాలని, ప్రతిచోటా లైటింగ్‌తోపాటు సిసి కెమెరాలను ఏర్పాటు చేసి, నెలరోజుల వరకు ఫుటేజీ ఉంచాలని సూచించారు. సమస్యలతో కాల్, మెసేజ్ ఏది వచ్చినా సిబ్బంది వెంటనే స్పందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా ఐటి కంపెనీ ప్రతినిధులు నరేష్, డిజిటల్ ప్రోడక్ట్ మేనేజర్ కీర్తన ఆనంద్ తదితరులు పలు సమస్యలను సిపి దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో డిసిపి అజిత వేజెండ్ల, ఎసిపి అప్పలరాజు, సిఐ జి. బాలకృష్ణ, ఐటి సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

పట్టుదలతో శ్రమిస్తే ఉత్తమ ఫలితాలు

ఫ్రెషర్స్ డే వేడుకల్లో ప్రొఫెసర్ కిషోర్‌బాబు



విద్యార్థులు జ్ఞాపికలు అందజేస్తున్న ప్రొఫెసర్ కిషోర్‌బాబు

ప్రజాశక్తి -తగరపువలస: కఠోర శ్రమ ద్వారానే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని ఆంధ్రా యూనివర్సిటీ రెక్టార్ ప్రొఫెసర్ ఎన్ కిషోర్‌బాబు విద్యార్థులకు సూచించారు శుక్రవారం స్థానిక అవంతి డిగ్రీ కళాశాల విద్యార్థుల ఫ్రెషర్స్ డే వేడుకలను కళాశాల ఆడిటోరియంలో నిర్వహించారు. జ్యోతిప్రజ్వలనతో వేడుకలను ప్రారంభించిన ప్రొఫెసర్ కిశోర్‌బాబు మాట్లాడుతూ, చదువుతో పాటు క్రీడల్లో కూడా ప్రతిభ చూపాలని సూచించారు. నేడున్న ప్రత్యేక పరిస్థితుల్లో సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింతగా పెంపొందించుకోవాలన్నారు. ప్రతి అంశాన్ని సృజనాత్మకంగా ఆలోచించాలని సూచించారు. తరగతి గదిలో అధ్యాపకులు చెప్పిన పాఠాలను తరచూ నెమరు వేసుకోవాలని, సందేహాలుంటే వెంటనే నివృత్తి చేసుకోవాలన్నారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఎ చంద్ర శేఖర్, ప్రిన్సిపాల్ పి రామకృష్ణ, పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పలు రంగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందజేశారు.

అయోడిన్ ఉప్పు వాడకంతో ప్రయోజనాలు



అవగాహనలో డిఎంహెచ్ఒ డాక్టర్ జగదీశ్వరరావు

ప్రజాశక్తి - సీతమ్మధార : మనిషి శరీరంలో అయోడిన్ లోపిస్తే ఎన్నో శారీరక, మానసిక రుగ్మతలు ఏర్పడతాయనిజిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్.పి.జగదీశ్వరరావు అన్నారు. అయోడిన్ ఉప్పు వాడకంతో ఎన్నో ప్రయోజనాలున్నాయని వివరించారు. శనివారం 21వ ప్రపంచ అయోడిన్ లోప రుగ్మతలు నివారణ దినోత్సవం సందర్భంగా వారోత్సవాలను డిఎంహెచ్ఒ ప్రారంభించారు. జిల్లాలోని అన్ని పాఠశాలలో అయోడిన్ లోపం వల్ల కలిగే అనర్థాలు, అయోడిన్ ఉప్పు వాడకం ప్రయోజనాలపై అవగాహన కల్పించాలన్నారు. తర్వాత వైద్యఆరోగ్యశాఖ జిల్లా అధికారులు అయోడైజ్డ్ ఉప్పు ఉపయోగాలు వివరించారు. అయోడిన్ శరీరానికి కావలసిన సూక్ష్మ పోషకమని, ఇది లోపిస్తే పిల్లల శారీరక, మానసిక ఎదుగుదల తగ్గుతుందన్నారు. గర్భిణులలో గర్భస్రావం, మృత శిశు జననాలు, నెలలు నిండకుండా ప్రసవం, జన్మించిన పిల్లలలో పుట్టుకతో లోపాలు సంభవించవచ్చన్నారు. అంతేకాక ఆహారంలో అయోడిన్ లోపిస్తే పిల్లలలో మరుగుజ్జుతనం, బుద్ధిమాంద్యం, చెవుడు, మూగ వంటి వైకల్యాలు వచ్చే అవకాశముందన్నారు. అయోడిన్ లోపం వాళ్ళ థైరాయిడ్ గ్రంధి పెరిగి గొంతు వద్ద వాపు వస్తుందన్నారు.. జిల్లాలో ప్రతి స్కూల్‌లో పిల్లల మంచి ఆరోగ్యానికి అయోడిన్ ఉప్పునే వాడాలని, అయితే రోజుకు ఒక స్పూన్‌కు మించి వాడరాదని సూచించారు. వాంబే కాలనీ పట్టణ ఆరోగ్య కేంద్ర పరిధిలోని సునీల్‌శర్మ కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు డాక్టర్.విశ్వనాథం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా అసంక్రమిత వ్యాధుల ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్.ఎన్.వి.సమత ప్రోగ్రాం అధికారులు, వాంబే కాలనీ పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్.సుస్మిత, ఆరోగ్య సిబ్బంది నాగభూషణం పాల్గొన్నారు.

బస్‌స్టాప్‌ల వద్ద బోర్డుల ఏర్పాటు


బస్‌స్టాప్‌ల వద్ద బోర్డు ఏర్పాటు చేస్తున్న సర్పంచ్

ప్రజాశక్తి-ఆనందపురం: మండలంలోని మామిడిలోవ పంచాయతీ సర్వీస్ రోడ్డులో బస్‌స్టాప్‌ల వద్ద బోర్డులు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో స్థానిక సర్పంచ్ బలిరెడ్డి మల్లికార్జునరావు తన సొంత నిధులతో నాలుగు బస్‌స్టాప్‌ల వద్ద సర్వీస్ రోడ్డుకు ఇరువైపులా రేడియం స్టిక్కర్లతో కూడిన బోర్డులను ఏర్పాటు చేశారు. సర్వీస్ రోడ్లు ఏర్పాటైన తర్వాత బస్‌స్టాప్‌ల వద్ద బోర్డులు లేకపోవడంతో కొత్త ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. సర్పంచ్ మల్లికార్జునరావు చొరవను పలువురు అభినందించి, హర్షం వెలిబుచ్చారు. కార్యక్రమంలో బలిరెడ్డి జగదీష్, ప్రజలు పాల్గొన్నారు.

అనంతుని గుడి నిర్మాణాల పరిశీలన

ప్రజాశక్తి-పద్మనాభం: మండలకేంద్రమైన పద్మనాభంలో కొండ శిఖరంపై ఉన్న అనంత పద్మనాభస్వామి ఆలయ నిర్మాణ పనులను శుక్రవారం దేవాదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ ఆకస్మాత్తుగా వచ్చి పరిశీలించారు. ఈ ఏడాది దీపోత్సవం నాటికి దేవాలయం పనులు పూర్తి అవుతాయా? లేదా?అనే దానిపై అధికారులతో సమీక్షించారు. ఇఒ నానాజీ బాబు పాల్గొన్నారు. కాగా కొండ దిగువనున్న కుంతి మాధవస్వామి ఆలయానికి దేవాదాయశాఖ కమిషనర్ వస్తారని ఎంపిపి కే రాంబాబు, పద్మనాభం సర్పంచ్ టి.పాప, వేచిచూశారు. కానీ ఆయన రాకపోవడంతో ఆలయ నిర్మాణ పనులు తెలియలేదు. సమస్యలు చెప్పే వీలు లేకపోయిందన్నారు.

పెరిగిన ధరలపై 1 నుంచి ఆందోళనలు

సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం

ప్రజాశక్తి-దేవరాపల్లి

పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలను అరికట్టాలని, విశాఖ డెయిరీ తగ్గించిన పాల ధరను వెంటనే పెంచాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం డిమాండ్ చేశారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో శుక్రవారం జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో లోకనాథం మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగిపోయి సామాన్య మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ధరలను అరికట్టాలని కోరుతూ నవంబరు 1 నుండి 15వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలని పార్టీ శ్రేణులకు లోకనాథం పిలుపునిచ్చారు.

మరో వైపు విశాఖ డెయిరీ యాజమాన్యం పాల సేకరణ ధరలను తగ్గించడం అన్యాయమన్నారు. నేడు వ్యవసాయ రంగం లాభ సాటిగా లేకపోవడంతో ఉత్తరాంధ్ర జిల్లాలోని సుమారు 3 లక్షల మంది రైతులు పాడిపై ఆధారపడి కుటుంబాలను పోషించుకుంటున్నారని తెలిపారు. నేడు డెయిరీ ఇస్తున్న ధర ఏమాత్రం గిట్టుబాటుగా లేదన్నారు. కనీసంగా ఆవుపాలకు లీటరకు రూ.50, గేదె పాలకు లీటరకు రూ.100 ఇవ్వాలని డిమాండ్ చేశారు. కానీ విశాఖ డెయిరీ యాజమాన్యం ఆవు పాలుకు లీటరుకు రూ.3 తగ్గించడం వలన పాడి రైతులకు తీవ్ర నష్టం జరుగుతుందని పేర్కొన్నారు. పశు పోషణ వ్యయం విపరీతంగా పెరిగినప్పటికీ విశాఖ డెయిరీ యాజమాన్యం పాల సేకరణ ధరలు పెంచకుండా ధరలను తగ్గించడం దుర్మార్గమన్నారు. వెంటనే విశాఖ డెయిరీ యాజమాన్యం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకొని తగ్గించిన ఆవు పాల ధరను పునరుద్ధరించకపోతే పాడి రైతులను సమీకరించి ఉద్యమిస్తామని హెచ్చరించారు. సిపిఎం మండల కార్యదర్శి బిటి దొర అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి వెంకన్న, నాయకులు జె.సన్నిబాబు, మూలగుమ్మి ఎర్రునాయుడు, షేక్ అప్పాజీ, సిహెచ్ దేముడు, కె ఈశ్వరరావు, వి దొంగబాబు, జె ఈశ్వరరావు, డి దాసు, జె పోతురాజు తదితరులు పాల్గొన్నారు,



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం

ఉపాధ్యాయ ఓట్లకు దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి-అనకాపల్లి

శ్రీకాకుళం విజయనగరం విశాఖపట్నం ఉపాధ్యాయుల నియోజకవర్గ డి.నోవా ఓటర్ల జాబితాలో గతంలో ఉన్న ఉపాధ్యాయులు తాజాగా ఫారం 19 ద్వారా నవంబర్ ఆరులోగా తాజాగా దరఖాస్తులు సమర్పించాలని జిల్లా రెవెన్యూ అధికారి బి దయానిధి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ముసాయిదా ఓటర్ల జాబితా నవంబర్ 23న ప్రకటించనున్న నేపథ్యంలో తమ దరఖాస్తులను ఆర్డీఓ, తహశీల్దార్, ఎంపీడీవో, మండల విద్యాధికారి కార్యాలయాల్లో గాని, ఆన్లైన్లో ఎన్నికల ప్రధాన అధికారి వెబ్సైట్ www.ceoandhra.nic.in లోగాని సమర్పించాలన్నారు. ఫారం 19 దరఖాస్తు చేసుకునే ప్రతి వ్యక్తి అర్హత తేదీకి ఆరేళ్ళ ముందు కనీసం మూడేళ్ల పాటు నిర్దిష్ట విద్యా సంస్థల్లో పని చేస్తున్నట్టు ధ్రువీకరణ పత్రం సమర్పించాలన్నారు.

దొంగతనాలు అరికట్టడంపై దృష్టి సారించాలి

ఎస్పి తుహిన్ సిన్హా ఆదేశం


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్ సిన్హా

ప్రజాశక్తి-అనకాపల్లి

దొంగతనాలను అరికట్టేందుకు, చోరీ సొత్తు రికవరీ శాతాన్ని పెంచేందుకు సీసీఎస్ పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశించారు. జిల్లా పోలీసు సెంట్రల్ క్రైమ్ స్టేషన్ సిబ్బందితో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ పరవాడలో జరిగిన ఏటీఎం దొంగతనంలో నిందితులు వాడినట్లు అనుమానిస్తున్న వాహనం కేరళ రాష్ట్రం, త్రిశూర్‌లో ఇదే రకమైన నేరంలో పట్టుబడిన నిందితుల వాహనంతో సరిపోలడంతో పీటీ వారెంట్‌పై నిందితుల్ని ఇక్కడికి తీసుకుని వచ్చి విచారించాలని సూచించారు. జిల్లాలో దొంగతనాలు ఏ విధంగా జరుగుతున్నది తెలుసుకుని, చేయవలసిన కార్యాచరణ గూర్చి అధికారులకు సూచనలు చేశారు. ఎస్పైల నేతృత్వంలో క్రైమ్ టీమ్‌లను ఏర్పాటు చేసి, దొంగతనాల్లో పోగొట్టుకున్న ఆస్తి రికవరీ శాతాన్ని పెంచేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాత్రి పగలు గస్తీలను ముమ్మురం చేయాలన్నారు. ఫింగర్ ప్రింట్ ఐడెంటిఫికేషన్ సిస్టంతో అనుమానాస్పద వ్యక్తుల వేలిముద్రలను తనిఖీలు చేయాలని సూచించారు. జైలు నుండి విడుదలైన నిందితుల కదలికలపై నిఘా కొనసాగించాలన్నారు. సరిహద్దు జిల్లాల పోలీస్ అధికారులతో మాట్లాడి నేరాలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బయట ఊర్లకు వెళ్లే వారు ఇంటిలో విలువైన బంగారం, నగదు వంటివి బ్యాంక్ లాకర్‌లో పెట్టుకొనే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అనుమానస్పద వ్యక్తుల కదలికలను పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీసీఎస్ ఎస్పైలు రమేష్, సత్యనారాయణ, ప్రసాద్, ఫణిదాసు సీసీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

అభిజీత్ కంపెనీని తెరవాలని రాస్తారోకో



అచ్యుతాపురంలో రాస్తారోకో చేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి-అచ్యుతాపురం

అచ్యుతాపురం ఎస్ఈజెడ్‌లో మూతపడిన అభిజిత్ ఫెర్రో టెక్ కంపెనీని తక్షణమే తెరవాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన స్థానిక జంక్షన్‌లో శుక్రవారం కార్మికులు రాస్తారోకో నిర్వహించారు. ఎలమంచిలి, అనకాపల్లి, పరవాడ, పూడిమడక రహదారులలో ర్యాలీ చేపట్టారు. పరిశ్రమ తెరవాలని, 1000 మంది కార్మికులకు ఉపాధి కల్పించాలని, ప్రభుత్వం స్పందించాలని పెద్ద పెట్టున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ అభిజిత్ యాజమాన్యం అక్రమంగా లే ఆఫ్ ప్రకటించడం దారుణమన్నారు. దీని వల్ల 1000 మంది కార్మికులు రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎటువంటి నిబంధనలు పాటించని కంపెనీ యాజమాన్యాన్ని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కంపెనీలో ఉత్పత్తి ప్రారంభించడానికి చర్యలు తీసుకొని కార్మికులను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని స్పష్టం చేశారు. ప్రభుత్వం నుండి కోట్లాది రూపాయలు రాయితీలు పొందుతున్న కంపెనీ యజమానులు అర్ధాంతరంగా కంపెనీలు మూసివేసి కార్మికులను రోడ్డున పడేస్తున్నారని విమర్శించారు. 11 రోజులుగా కంపెనీ మూతపడినా కార్మిక శాఖ, జిల్లా, సెజ్ అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ పెద్దలు స్పందించకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు రొత్తల శంకర్రావు, జిల్లా ఉపాధ్యక్షులు రొంగలి రాము, పెద్ద సంఖ్యలో అభిజిత్ కార్మికులు పాల్గొన్నారు.

కశింకోట : అభిజిత్ కంపెనీ యాజమాన్యం అక్రమ లే ఆఫ్‌ను ఎత్తివేసి, వెంటనే కంపెనీని తెరవాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన మండలంలోని జోగారావుపేట గ్రామస్తులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు దాకారపు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా అకస్మాత్తుగా అక్రమంగా లే ఆఫ్ ప్రకటించడం చట్ట విరుద్ధమన్నారు. ఇప్పటికైనా కంపెనీ యాజమాన్యంపై సంబంధిత అధికారులు, ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎం.సన్యాసిరావు, జె.శ్రీనివాసరావు, చంద్రరావు, జే.పుష్పవతి, జే.పాపమ్మ, ఎం.భూలక్ష్మి, ఎం.కుమారి, కె.ఈశ్వరరావు, ఎం.సోమునాయుడు, కె.సత్తిబాబు, ఎం.త్రినాధరావు పాల్గొన్నారు.


జోగారావుపేటలో నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

ఖేల్ ఇండియా రగ్బీ పోటీలకు జట్టు ఎంపిక

ప్రజాశక్తి -అచ్యుతాపురం

ఖేలో ఇండియా రగ్బీ పోటీల్లో పాల్గొనడానికి అనకాపల్లి జిల్లా సీనియర్ జట్టు ఎంపికైనట్లు నేషనల్ కోచ్ వెంకట్ తెలిపారు. మండలంలో భోగాపురం క్రికెట్ గ్రౌండ్‌లో శుక్రవారం క్రీడాకారుల ఎంపిక ప్రక్రియ నిర్వహించారు. ఆర్ బాల, డి. వసంత, ఎస్.లీల, పి.రేఖ, జి.భారతి, బి.సంధ్య, బి.స్వర్ణ రేఖ, కె.ప్రవళిక, ఎస్.షర్మిల, పి గంగాభవాని, జి కావ్య, ఎస్ కుసుమ, వి రమ్య, ఎ.మానస, పి.మానస ఎంపికయ్యారు. వీరు ఈనెల 27న రాజీవ్ గాంధీ ఇంజినీరింగ్ మెమోరియల్ కాలేజీ నంద్యాలలో జరగబోతున్న పోటీలలో ఆడతారని పేర్కొన్నారు. క్రీడాకారుల ఎంపిక ప్రక్రియలో కె వెంకు నాయుడు, క్రైస్ట్ కాలేజీ కరస్పాండెంట్ రెడ్డి చిరంజీవి, ఇషాన్ చిల్డ్రన్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ వెంకట్, శ్రీవిష్ణు హాస్పిటల్ దంత వైద్య నిపుణులు ఏ సుధీర్, మిడివైస్ హాస్పిటల్ డాక్టర్ జగదీష్, విద్యా సంస్థల పిడి శివాజీ, వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

29, 30 తేదీల్లో జిల్లా స్థాయి సివిల్ సర్వీసెస్ ప్రభుత్వ ఉద్యోగుల ఆటల పోటీలు

ప్రజాశక్తి- అనకాపల్లి : జిల్లా స్థాయి సివిల్ సర్వీసెస్ పురుషులు, స్త్రీ ఉద్యోగస్తులకు 18 క్రీడాంశాల్లో క్రీడా ఎంపికలు ఈ నెల 29, 30 తేదీలలో జరుగనున్నాయని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎల్వి.రమణ తెలిపారు. స్థానిక విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడుతూ సివిల్ సర్వీసెస్ పోటీలు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ స్టేడియం, కలెక్టరు కార్యాలయం వద్ద గల గ్రౌండు, చిన్న హైస్కూల్, రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియం, డీసీఎంఎస్ గ్రౌండ్, జార్జ్ క్లబ్‌ల్లో జరుగుతాయని తెలిపారు. జిల్లా స్థాయి సెలెక్షన్స్‌లో ఎంపిక కాబడిన వారు రాష్ట్రస్థాయిలో నవంబర్ 6 నుంచి 9 వరకు జరిగే సివిల్ సర్వీసెస్ ఎంపికలలో పాల్గొంటారని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో ఎంపిక కాబడిన క్రీడాకారులు అఖిల భారత సివిల్ సర్వీసెస్ క్రీడల పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. అర్హులైన సివిల్ సర్వీసెస్ ఉద్యోగస్తులు తమ గుర్తింపు ధ్రువపత్రాలతో తమ పేరు అనకాపల్లి జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ వద్ద నమోదు చేసుకోవాలని సూచించారు. పూర్తి సమాచారం కొరకు పివి నాగేశ్వరరావు, హ్యాండ్బాల్ కోచ్ -7382841568, జి.రాంబాబు, హాకీకోచ్, 9885530819 లను సంప్రదించాలని కోరారు.

పరీక్షలకు నిర్దిష్ట ప్రణాళికతో వెళ్లాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే పదో తరగతి విద్యార్థులు నిర్దిష్ట ప్రణాళికతో చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని విక్రమ్ ఆసుపత్రి వైద్యులు జివి సత్యనారాయణ తెలిపారు. మండలంలోని తుమ్మపాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు పరీక్షలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు ఆరోగ్యంపై కూడా దృష్టి సారించాలన్నారు. ఇందుకు వ్యాయామం కూడా ఎంతో అవసరమన్నారు. విద్యార్థులు ఒత్తిడి లేని విధానంలో పఠనాశక్తిని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ కమిటీ ఛైర్మన్ బలరాం, ఆడారి గోవిందరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'మెగాస్టార్ ఫ్యాన్' పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి- అనకాపల్లి : మెగాస్టార్ చిరంజీవి మీద ఉన్న అభిమానంతో అల్లు శ్రీరాముల నాయుడు నిర్మాణ సారథ్యంలో కిరణ్ వారియర్ నూతన దర్శకత్వంలో లుక్స్‌రాజ్, సోనోరెడ్డి హీరో హీరోయిన్లుగా, సైప్రేమ్ సూర్య, జబర్దస్త్ అప్పారావు నటీనటులుగా నటించిన చిత్రం మెగాస్టార్ ఫ్యాన్ పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. మెగాస్టార్ చిరంజీవి, పవన్ కళ్యాణ్, రామ్ చరణ్ ఫ్యాన్స్ అధ్యక్షులు శ్రీరామదాసు గోవింద, గల్లా కొండలరావు, బొడ్డేడ శ్రీనివాసరావు, మళ్ళ శ్రీను, బొడ్డేడ మురళి చేతుల మీదుగా దీనిని ఆవిష్కరించారు. శ్రీరామదాసు గోవింద మాట్లాడుతూ తెలుగు సినిమా ఇండస్ట్రీలో ఎన్టీ రామారావు, అక్కినేని నాగేశ్వరరావు ప్రభంజనంగా ఉన్న రోజుల్లో ఒక మెరుపులా మెరిసిన ధ్రువతార మెగాస్టార్ చిరంజీవి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో షేక్ మదర్, పెతకంశెట్టి రమణబాబు వరహాలు తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు పిల్లలను పర్యవేక్షించాలి

ప్రజాశక్తి- అనకాపల్లి : విద్యార్థుల పర్యవేక్షణ బాధ్యత విద్యాసంస్థల్లో ఉపాధ్యాయులతో పాటు వారి తల్లిదండ్రులు కూడా వహించాలని డైట్ కళాశాల ఛైర్మన్ దాడి రత్నాకర్ అన్నారు. డైట్‌లో బి.టెక్ మొదటి సంవత్సరం విద్యార్థుల తల్లి తండ్రులు - ఉపాధ్యాయుల సమావేశం శుక్రవారం కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు కొరకు ఉన్నతంగా ఆలోచించి వారి అవసరాలకు తగ్గట్టుగా శ్రద్ధ చూపాలన్నారు. ఆధునిక ప్రపంచంలో ఉద్యోగాలలో పోటీతత్వం ఎంతో పెరిగిందని, దానికి తగ్గట్టుగా విద్యార్థులు నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. భవిష్యత్తులో సంవత్సరానికి రూ.30 లక్షల నుండి రూ.65 లక్షల ప్యాకేజీలు ఇచ్చే కంపెనీలను డైట్ కళాశాల తీసుకువస్తుందని చెప్పారు.

పాల సేకరణ ధరను పునరుద్ధరించాలి

29న విశాఖ డెయిరీ వద్ద మహాధర్నాను జయప్రదం చేయాలని ప్రచారం

ప్రజాశక్తి-కె.కోటపాడు

విశాఖ డెయిరీ యాజమాన్యం తగ్గించిన ఆవు పాలు ధరను తక్షణమే పునరుద్ధరించాలని ఏపి రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆవు పాలు సేకరణ తగ్గింపునకు వ్యతిరేకంగా ఏపి పాల రైతుల సంఘం ఆధ్వర్యాన ఈ నెల 29న నాతయ్యపాలెంలోని విశాఖ డెయిరీ వద్ద జరుగు మహాధర్నాకు పాడి రైతులు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరుతూ రైతు సంఘం నాయకులు మండలంలోని లంకవానిపాలెం, పిండ్రంగి, దీక్షితుల అగ్రహారం, గవరపాలెం కొరువాడ గ్రామాలలో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు గండి నాయనబాబు, పెనుగంటి నాయుడుబాబు మాట్లాడుతూ ప్రతి ఏటా డెయిరీకి వచ్చిన లాభాలను యాజమాన్యం వివిధ రూపాలలో అవినీతి అక్రమాలు చేసి కాజేస్తూ, డెయిరీకి నష్టాలు చూపిస్తున్నారని విమర్శించారు. రెండు సంవత్సరాలుగా రైతులకు బోనస్‌లు ఇవ్వడం లేదని, రూ.250 కోట్లు రైతుల యొక్క మూలధనంపై వచ్చే లాభాలను రైతులకు ఇవ్వకుండా యాజమాన్యం దాటవేస్తుందని పేర్కొన్నారు.

అనకాపల్లి : విశాఖ డెయిరీ ఇటీవల తగ్గించిన ఆవుపాల ధరలను తక్షణమే పెంచాలని రైతు సంఘం నాయకులు కాళ్ళ తేలయ్య బాబు, రావి దేవుడు, మంద రాము డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం అనకాపల్లి మండలం తుమ్మపాల, వెంకుపాలెం గ్రామాలలో పాల రైతులతో మాట్లాడారు. 29న జరుగు మహాధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా పాల సేకరణ ధరలను పెంచాల్సి ఉండగా రైతులతో సంప్రదించకుండా ఏకపక్షంగా పాల సేకరణ ధర తగ్గించడం దారుణమన్నారు. ఆవుపాలకు లీటరుకు కనీసం రూ.50, గేదె పాలకు లీటరుకు రూ.100 ఇవ్వాలన్నారు.



కె.కోటపాడు మండలంలో రైతులతో మాట్లాడుతున్న నాయకులు

సబ్బవరం : ఈనెల 29న విశాఖ డెయిరీ ఎదుట జరుగు మహా ధర్నాను విజయవంతం చేయాలని స్థానిక సిపిఎం నాయకులు ఎం గౌరేష్, కోటేశ్వరరావు ఆధ్వర్యంలో మండలంలోని వంగలి, నాయనమ్మ పాలెం, గొర్లవానిపాలెం, అమృతపురం గ్రామాలలో పాల సొసైటీ కేంద్రాల వద్ద కరపత్రాలతో ప్రచారం నిర్వహించారు. పాలకు గిట్టుబాటు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు.

వెలుగు ఎపిఎంగా రాజుబాబు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-బుచ్చెయ్యపేట : బుచ్చెయ్యపేట మండల వెలుగు ఏపిఎంగా టి.రాజుబాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా పాయకరావుపేట వెలుగు కార్యాలయం నుంచి ఆయన ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేసిన బాలరాజు మునగపాక వెలుగు కార్యాలయానికి బదిలీ అయ్యారు. నూతన ఏపిఎంగా బాధ్యతలు స్వీకరించిన రాజుబాబుకు సిసిలు, సిఏలు కలిసి స్వాగతం పలికారు. డ్వాక్రా మహిళలను ఆర్థికంగా ప్రోత్సాహించేందుకు రుణాలు మంజూరుకు కృషి చేస్తామన్నారు.

ఘనంగా మరిడిమాంబ విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని మోసయ్యపేట గ్రామంలో శ్రీమరిడిమాంబ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి గొంతిని శ్రీనివాసరావు, టిడిపి బీసీ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ మళ్ళ సురేంద్ర అమ్మవారికి చీర సారెను సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ అచ్చర్ల గ్రామ అధ్యక్షులు నైనంశెట్టి రమణ రావు, తాళ్లపాలెం టీడీపీ అధ్యక్షులు ఉల్లింగల రమేష్, కర్రి దుర్గునాయుడు, ఆలయ కమిటీ నాయకులు దుద్దెటి శ్రీను, గ్రామస్తులు పాల్గొన్నారు.

చెస్ పోటీలకు ఎంపికైన విద్యార్థినికి అభినందనలు

ప్రజాశక్తి-మునగపాక : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఆడారి మౌనిక అన్నపూర్ణ రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపిక కావడంతో ఆమెను గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కర్రి సాయి కృష్ణ అభినందించారు. జిల్లా స్థాయి చెస్ పోటీల్లో ప్రతిభ కనబరిచి ఈ నెల 27, 28, 29 తేదీల్లో బాపట్ల జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి చెస్ పోటీల్లో మౌనిక పాల్గొననుంది. ఈ సందర్భంగా స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మౌనికను శాలువాతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో తెలుగు యువత నియోజకవర్గం అధ్యక్షుడు పెంటకోట విజయ్, పాఠశాల ఛైర్మన్ ఆడారి సూర్యచంద్ర రామారావు, గ్రామ టిడిపి ప్రధాన కార్యదర్శి శ్రీరామ్మూర్తి, విల్లూరు లోక నర్సింగరావు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి-చోడవరం : చోడవరంలో ఎన్ఆర్ఇజిఎస్ నిధులతో జరుగుతున్న అభివృద్ధి పనులను పంచాయతీరాజ్‌శాఖ ఈఈ వీరమనాయుడు శుక్రవారం పరిశీలించారు. టీచర్స్ లేఔట్, బాలాజీ నగర్, ద్వారకా నగర్, జర్నలిస్టు కాలనీలో జరుగుతున్న డ్రైనేజీ పనులను సందర్శించారు. పనులు నాణ్యతతో ఎలాంటి రాజీ పడవద్దని అధికారులకు సూచించారు. చోడవరం పట్టణంలో రూ.2 కోట్లతో డ్రైనేజీ, సిసి రోడ్లు నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు ఇటీవల శంకుస్థాపన చేశారని, వాటిని కాంట్రాక్టర్ వేగంగా పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ డిఇ డిఎస్.ప్రసాద్, ఏఈ శాంతారామ్, సచివాలయ ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థిని పట్ల లైంగిక వేధింపులపై విచారణ జరపాలి

- పోక్సో కేసులో నిందితునికి స్టేషన్ బెయిల్ సరికాదు
- 10 రోజులు దాటినా పురోగతి లేని కేసు విచారణ
- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమణ



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమణ

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లాలో ఎలమంచిలి రూరల్ లైన్ కొత్తూరు న్యూ లైఫ్ హాస్టల్లో తొమ్మిదో తరగతి చదువుతున్న బాలికపై లైంగిక వేధింపులపై సమగ్ర విచారణ చేపట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రమణ డిమాండ్ చేశారు. అనకాపల్లి దొడ్డి రామునాయుడు భవనంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బాలికల హాస్టల్లో పురుషులు ఉండకూడదని, అలాంటిది న్యూలైఫ్ హాస్టల్లో మగవారు ఉంటూ 9వ తరగతి చదువుతున్న బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడడం దారుణమన్నారు. విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన శ్రీనివాస్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాలికల వసతి గృహంలో ఉంటున్న మగవారిని వెంటనే బయటకు పంపించాలన్నారు. నిందితునిపై పోక్సో కేసు నమోదు చేసినప్పటికీ వెంటనే స్టేషన్ బెయిల్ ఇవ్వడం సరికాదన్నారు. దీనివల్ల విద్యార్థిని కుటుంబానికి హాని ఉంటుందని, వారిని భయపెట్టి సాక్ష్యాలు తారుమరు చేసే ప్రయత్నాలు జరుగుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. హోంమంత్రి వంగలపూడి అనిత సొంత జిల్లాలో ఇటువంటి ఘటనలు జరగడం సిగ్గుచేటన్నారు. ఈ నెల 14న కేసు నమోదైనా ఇంతవరకూ పోలీసుల విచారణలో పురోగతి లేకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా పోలీసులు త్వరితగతిన విచారణ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే పెద్ద ఎత్తున విద్యార్థులను ఐక్యం చేసి పోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు కె.అర్జున్, ఎస్. ప్రసాద్, వి.నాగేష్ పాల్గొన్నారు.

వైద్యుల హక్కులు, కర్తవ్యాలపై సదస్సు

ప్రజాశక్తి-సబ్బవరం : "వైద్యుల హక్కులు, కర్తవ్యాలు, నైతిక సవాళ్లు" అనే అంశంపై గీతం న్యాయ విశ్వవిద్యాలయం, దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం (డిఎస్ఎన్ఎల్‌యు) సంయుక్తంగా ప్రత్యేక సదస్సు నిర్వహించాయి. ఈ సందర్భంగా డిఎస్ఎన్ఎల్‌యు ఉపకులపతి ప్రొఫెసర్ సూర్యప్రకాశరావు మాట్లాడుతూ వైద్యులకు ఉన్న న్యాయ, నైతిక బాధ్యతలను అవగాహన కల్పించడమే కాకుండా, వారి వృత్తిలో ఉన్న హక్కులు, బాధ్యతలు, నైతిక పరమైన సందేహాలను చర్చించడం లక్ష్యంగా ఈ సదస్సు నిర్వహించినట్లు చెప్పారు. ఇందులో రోగుల గోప్యత, సమ్మతి, ఆరోగ్య సంరక్షణ రంగంలో సవాళ్లకు సంబంధించిన అంశాలు చర్చించబడ్డాయని తెలిపారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సిపి.నందిని మాట్లాడుతూ వైద్యుని బాధ్యతలు, వినియోగదారుల హక్కులు, వైద్య నిర్లక్ష్యం కారణంగా ఎదురయ్యే పరిణామాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వైద్య వృత్తి నిపుణులు, న్యాయ నిపుణులు, లా విద్యార్థులు పాల్గొని వైద్యుల ముందున్న నైతిక, న్యాయ, ప్రాక్టికల్ సవాళ్లపై చర్చించారు. డాక్టర్ ఆర్.దీప్తి, డాక్టర్ ఎన్.భాగ్యలక్ష్మి, డాక్టర్ పి.భువనేశ్వరిల ఆధ్వర్యంలో న్యాయ సేవ కేంద్రం ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది.

పారిశుద్ధ్యం, తాగునీటిపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి-అచ్యుతాపురం : గ్రామాలలో పారిశుద్ధ్యం, తాగునీరుపై దృష్టి సారించాలని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ అధికారులను ఆదేశించారు. అచ్యుతాపురంలో శుక్రవారం ఆయన నియోజక వర్గ స్థాయి అధికారులతో పారిశుద్ధ్యం, తాగునీరుపై సమీక్షించారు. గ్రామ రహదారులకు ఇరువైపులా బహిరంగ మలమూత్ర విసర్జనలు చేయకుండా హెచ్చరికలు చేయాలని సూచించారు. అంటూ వ్యాధులు ప్రబలకుంట ముందు జాగ్రత్తలు చేపట్టాలన్నారు.

రెవెన్యూ గ్రామసభలపై అసంతృప్తి

అర్జీలకు రశీదులు ఇవ్వాలని డిమాండ్

ప్రజాశక్తి-అచ్యుతాపురం

గ్రామాలలో నిర్వహిస్తున్న రెవెన్యూ గ్రామసభల పట్ల పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గ్రామసభల వల్ల కొత్తగా జరిగేదీ ఏమీ లేదంటున్నారు. మండలంలోని పెదపాడు గ్రామంలో శుక్రవారం జరిగిన గ్రామసభలో పలువురు రైతులు ఇచ్చిన దరఖాస్తులకు రసీదులు కావాలని అడిగారు. దరఖాస్తులకు రసీదులు ఇవ్వకుంటే తమకు ఏమి న్యాయం జరుగుతుందని ప్రశ్నించారు. గత ప్రభుత్వంలోనూ ఇదేవిధంగా జరిగాయని గుర్తు చేశారు. అధికార యంత్రాంగం పునరాలోచించి గ్రామసభలలో ఇచ్చిన దరఖాస్తులకు రసీదులు ఇవ్వాలని కోరుతున్నారు. ఈ గ్రామసభలో తహశీల్దారు జివి జనార్ధన్, మాజీ జడ్పిటిసి సభ్యుడు జనపరెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సబ్బవరం : మండలంలోని ఆరిపాక పంచాయితీ లగిశెట్టిపాలెం గ్రామంలో శుక్రవారం జరిగిన రెవిన్యూ సదస్సులో భూ రీ సర్వే సమస్యలపై 60 అర్జీలు అందినట్లు స్థానిక తహసీల్దార్ బి.చిన్నికృష్ణ తెలిపారు. కార్యక్రమంలో రీ సర్వే డిటి గణేష్, మండల సర్వేయర్ అప్పారావు, వైస్ ఎంపీపీ శరగడం ఝాన్సీలక్ష్మీరాణి, శరగడం రాము, అండి బోయిన బంగారయ్య, ఆడారి నాగరాజు, వై.రాజేష్, గొంప నర్సింగరావు, వీఆర్వో బోర అప్పలరాజు, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


ఎస్.రాయవరం : రీ సర్వే గ్రామాలలోని రైతుల సమస్యల పరిష్కారానికి రీ సర్వే గ్రామసభలు ప్రభుత్వం ఏర్పాటు చేసిందని తహశీల్దారు జె.రమేష్ బాబు అన్నారు. శుక్రవారం తిమ్మాపురం పంచాయితీలో రీ సర్వే గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. . ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ మూర్తి, సర్పంచ్ కర్రి సత్యన్నారాయణ డిటి నీరజ, సర్వేయర్ మూర్తి, వీఆర్వో నూకరాజు పాల్గొన్నారు.

కోటవురట్ల : లింగాపురం గ్రామంలో తహసిల్దార్ తిరుమల బాబు ఆధ్వర్యాన గ్రామసభ నిర్వహించారు. గ్రామానికి సంబంధించి వివిధ సమస్యలపై అత్యధికంగా 90 సమస్యలను రైతులు అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ప్రధానంగా విస్తీర్ణంలో తేడాలు, ఆధార్ నెంబర్లు, ఫోటోలు వంటి తేడాలు సహ డీ ఫాం భూములపై ఆయన దృష్టికి ఫిర్యాదుదార్లు తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గంగారత్నం, టిడిపి నాయకులు నారాయణమూర్తి, వైసిపి నాయకులు రమణ పాల్గొన్నారు.

గొలుగొండ : మండలంలోని లింగందొరపాలెం రెవెన్యూ గింజర్తి గ్రామంలో తహశీల్దార్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో రీ సర్వే గ్రామసభ నిర్వహించారు. ఈ గ్రామసభలో 34 అర్జీలు వచ్చాయి. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గెడ్డం సత్యనారాయణ, మండల సర్వేయర్ సత్యనారాయణ, ఆర్ఐ నాగరాజు, వీఆర్వో మోహన దుర్గా, రైతులు పాల్గొన్నారు

ప్రభుత్వ భూమి ఆక్రమణపై ఫిర్యాదు

మునగపాక : ప్రభుత్వ భూమి ఆక్రమణదారునిపై చర్యలు చేపట్టాలని కోరుతూ మండలంలోని నారాయణపాలెం గ్రామానికి చెందిన పలువురు నాయకులు పాటిపల్లి గ్రామంలో బుధవారం జరిగిన రెవెన్యూ సదస్సులో తహశీల్దారు ఆదిమహేశ్వరరావుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు సబి శ్రీనివాసరావు మాట్లాడుతూ పాటిపల్లి రెవెన్యూ నారాయణపాలెం గ్రామ సర్వేనెంబర్ 100/7లో గల ప్రభుత్వ భూమి గ్రామ అవసరాలకు ఉంచగా, గ్రామానికి చెందిన కోన అచ్చం నాయుడు అనే వ్యక్తి ఆక్రమణకు దిగుతున్నాడని పేర్కొన్నారు. గతంలో ఎన్నోసార్లు హెచ్చరించిన ఆయన వినడం లేదని, గ్రామ భవిష్యత్తు దృష్ట్యా ఈ భూమి అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు కొయ్య రమణ, ఎర్ర రాము, ఉప సర్పంచ్ మొల్లి సంతోష్, దాసరి గోపాలకృష్ణ, వై గోవింద, కాకర రాజు, నెల్లి పోతురాజు, కాకర నానాజీ పాల్గొన్నారు.



ప్రభుత్వ భూమి ఆక్రమణపై ఫిర్యాదు చేస్తున్న నారాయణ పాలెం గ్రామస్తులు

పలుచోట్ల పశుగణన ప్రారంభం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్

ప్రజాశక్తి- అనకాపల్లి :పశు గణన కార్యక్రమాన్ని జిల్లా కలెక్టరు కార్యాలయ ఛాంబరులో శుక్రవారం కలెక్టరు విజయ క్రిష్ణన్ లాంఛనంగా ప్రారంభించారు. ఇందులో భాగంగా పశు గణన గోడ పత్రిక, గణన కిట్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 21వ జాతీయ పశు గణన ప్రక్రియ కింద చేపడుతున్న ఈ కార్యక్రమంలో గేదెలు, ఆవులు, కోళ్ళు, గొర్రెలు, మేకలు తదితర 16 రకాల పశువులు, జీవాల సంఖ్య లెక్కించి, యాప్లో నమోదు చేయనున్నట్లు వివరించారు. జిల్లాలో అక్టోబర్ 25 నుండి ఫిబ్రవరి 28 వరకు జరిగే ఈ పశుగణన కార్యక్రమం కొరకు 294 ఎన్యుమరేటర్లు, 59 మంది సూపర్వైజర్లను నియమించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టరు ఎం.జాహ్నవి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బి.రామమోహనరావు, ఏరియా పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ సౌజన్య, పశుసంవర్ధక శాఖ అధికారులు పాల్గొన్నారు.

కోటవురట్ల: మండల కేంద్రంలో పశు వైద్యశాల వద్ద జాతీయ పశు గణన కార్యక్రమాన్నిశుక్రవారం ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు ప్రారంభి ంచారు. పశువైద్యులు హరిప్రియ మాట్లాడుతూ, పశువులు, కోళ్ళు, మేకలు, కుందేళ్ళు, గొర్రెలు వంటి వాటిని నమోదు చేయించుకోవాలన్నారు. పశు వైద్య సిబ్బంది ఇంటి వద్దకు వచ్చి పశు గణన చేపడతారని, నాలుగు నెలల పాటు జరిగే ఈ కార్యక్రమాన్ని రైతులంతా సక్రమంగా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పశు బీమా తదితర వంటి ప్రభుత్వ పథకాలు లబ్ది పొందేందుకు ప్రభుత్వం అందిస్తున్న ఈ పథకాలను సద్వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు సూర్యారావు, రాంబాబు పాల్గొన్నారు.

దేవరాపల్లి : పశుగణన గోడ పత్రికను టిడిపి మండల అధ్యక్షులు చితిమిరెడ్డి సూర్యనారాయణ, మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, తహశీల్దార్ లక్ష్మీదేవి చేతుల మీదుగా శుక్రవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారి కె.మంజుషారాణి, మామిడిపల్లి పశు వైద్యాధికారి ప్రియాంక, సర్పంచ్ ఆదిరెడ్డి వరలక్ష్మి, ఎంపిటిసి కిలపర్తి రాజేశ్వరి పాల్గొన్నారు.

సబ్బవరం : స్థానిక ప్రాంతీయ పశు వైద్యశాల ఆవరణలో సబ్బవరం మేజర్ పంచాయతీ సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ కె ఉషారాణి శుక్రవారం పశుగణన వాల్ పోస్టర్ను ఆవిష్కరించారు. రావులమ్మపాలెంలో అంతకాపల్లి పశు వైద్యాధికారి డాక్టర్ జి అరుణ, లగిశెట్టిపాలెంలో వైస్ ఎంపీపీ రూన్సీ లక్ష్మీ రాణి ఆధ్వర్యాన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రొంగలి దేముడు బాబు, ఎంపీటీసీలు బైలపూడి దేముడు బాబు, గొర్లి చైతన్య, ఎర్రంశెట్టి రాము, సబ్బవరపు రమణ, పల్లా రమణ, సబ్బవరపు గాంధీ పాల్గొన్నారు.

కె.కోటపాడు : మండలంలోని పైడంపేటలో పశు గణన కార్యక్రమాన్ని పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు దినేష్ కుమార్ శుక్రవారం పైడం పేట సర్పంచ్ రాఘవ నాయుడుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏడి మాట్లాడుతూ పశుగణన సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి వివరాలు సేకరిస్తారని తెలిపారు. కార్యక్రమంలో పశు సంవర్ధక గ్రామ సహాయకులు పాల్గొన్నారు.

తగరపువలస : 21వ అఖిల భారత పశుగణనను భీమిలి మండలం సింగనబంద పంచాయతీ కృష్ణంరాజుపేటలో జెడ్పిటిసి గాడు వెంకటప్పడు శుక్ర వారం పోస్టర్ ఆవిష్కరణ చేసి ప్రారంభించారు.పశు సంవర్ధకశాఖ భీమిలి డివిజన్ ఎడి డాక్టర్ వెంకటరమణ, దాకమర్రి డాక్టర్ కాంతికిరణ్ మాట్లాడుతూ, ఆవులు, గేదెలు, కో ళ్ళు, మేకలు, గొర్రెలు తదితరాల వివరాలను ఇంటింటికి వెళ్లి సేకరించి, యాప్లో అప్లోడ్ చేస్తారన్నారు. సర్పంచ్ జి వి నారాయణ, పలువురు రైతులు పాల్గొన్నారు. తాళ్ళవలస పంచాయతీ గొల్లల తాళ్ళ వలసలో పశు వైద్యాధికారి డాక్టర్ ఎస్జ ప్రశాంతి ఆధ్వర్యంలో ఎంపిటిసి కోరాడ రమణ పోస్టర్ ఆవిష్కరించారు.

పద్మనాభం: మండలంలో మద్ది గ్రామంలో పశుగణనను ఎంపిపి రాంబాబు, వెటర్నరీ ఎడి బి.వెంకటరమణ ప్రారంభించారు.కృష్ణాపురం, పద్మనాభం, రెడ్డిపల్లి, కొవ్వాడ, పాండ్రంగి గ్రామాల్లో పశుగణన చేపట్టారు.



పోస్టర్ను ఆవిష్కరిస్తున్న జెడ్పిటిసి వెంకటప్పడు

మాజీ జెడ్పిటిసి కె.దామోదరరావు, టిడిపి మాజీ అధ్యక్షుడు నగేష్కుమార్ పాల్గొన్నారు.

గోపాలపట్నం :పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే పెతకంశెట్టి గణబాబు కార్యాలయంలో పశుగణన పోస్టరును ఆవిష్కరించారు. కార్యక్రమంలో వెటర్నరీ ఎడి బి స్వప్న, డాక్టర్ ఎ.రవికుమార్, లైవ్ స్టాక్ అసిస్టెంట్, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆనందపురం : మండలంలోని చందక గ్రామంలోపశు గణన సర్వేను శుక్రవారం ప్రారంభించారు. పాడిరైతులు, మూగజీవాల పెంపకందారులు సహకరించాలని కోరారు. సర్వేలో లెక్కించిన పశువులకు టాకాలు వేశారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారి డాక్టర్ అనిల్ కుమార్. పశువైద్యసిబ్బంది సాగర్ పాల్గొన్నారు.

పశువుల పెంపకంతో అధిక ఆదాయం

నర్సీపట్నం టౌన్:గ్రామీణులకు పశువుల పెంపకం కీలకమైన ఆర్థిక వనరని స్థానిక పశువైద్యశాల సహాయసంచాలకులు రాంబాబు తెలిపారు. శు క్రవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ, వ్యవసాయంపై ఆధారపడిన కుటుంబాలకు పశు పోషణ అదనపు ఆదాయాన్ని అందిస్తుందని తెలిపారు. రైతు కుటుంబాలకు ప్రాథమిక జీవనోపాధిగా పశు పోషణ సహకరిస్తుందన్నారు. ముఖ్యంగా ప్రకృతి వైపరీత్యాలు, సంక్షోభ సమయాల్లో గ్రామీణ ప్రాంతాలలో కీలకమైన ఆదాయ వనరుగా ఉంటుందని తెలిపారు. పశుగణనలో భాగంగా గృహాలను సందర్శనకు వచ్చిన సమయంలో తమ వద్ద పశువులు, కోళ్ళు, కుక్క లు, పందులు, గొర్రెలు వంటి వాటికి సంబంధించిన సమాచారాన్ని వారికి అందించాలని కోరారు. ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి పశుగణన నిర్వహించడం జరుగు తుందన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎంఇఒ

ప్రశస్త యాప్పై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి -నక్కపల్లి:ప్రశస్త యాప్ పై అవగాహన కలిగి ఉండాలని ఎంఈఓ లు నరేష్, వేమగిరి సూకరాజు సూచించారు. మండల కేంద్రంలో శుక్రవారం ఎంఆర్ సి కేంద్రంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ప్రశస్త యాప్ పై అవగాహన కల్పించారు. ప్రశస్త యాప్ ముఖ్య ఉద్దేశంపై వివరించారు. విద్యార్థుల వివరాలను యాప్ లో నమోదు చేయాలని సూచించారు. ప్రత్యేక ఉపాధ్యాయురాలు యాస్మిన్ మాట్లాడుతూ, లాగిన్ ఏ విధంగా అవ్వాలి, స్క్రీనింగ్ ఎలా చేయాలి తదితర అంశాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులలో ఉన్న అభ్యసన లోపాల్ని తెలుసుకునేందుకు ఈ యాప్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.



కోదండరావును సత్కరిస్తున్న నగేష్

కోదండరావుకు సత్కారం

ప్రజాశక్తి- నక్కపల్లి:మత్స్యకారులు పుట్టుక వికాసం అభివృద్ధి గ్రంథ రచయిత పిక్కి కోదండరావును శుక్రవారం జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్, జనసేన నేత తోట నగేష్ సత్కరించారు. ఈ గ్రంథాన్ని కోదండరావు పాయకరావుపేటలో తోట నగేష్ కు అందజేశారు. ఈ సందర్భంగా కోదండరావును అభినందించి సత్కరించారు. తోట నగేష్ మాట్లాడుతూ, మత్స్యకారుల స్థితిగతులను అధ్యయనం చేసి, పుస్తక రూపంలో ఆవిష్కరించడం అభినందనీ యమన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కోసూరి నాని బాబు,గంపల నాగ శరత్ కుమార్ పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న నాయకులు

కల్వర్టు పనులు ప్రారంభం

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్: మున్సిపాలిటీ 8వ వార్డు రామారావుపేటలో కల్వర్టుల నిర్మాణ పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. మున్సిపాలిటీ జనరల్ ఫండ్ నిధులు సుమారు 6 లక్షల రూపాయలతో మూడు కల్వర్టుల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. కూటమి ప్రభుత్వం వచ్చిన నాలుగు నెలల్లోనే రామా రావుపేటలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని కూటమి నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ వార్డు ఇన్చార్జ్ నీటికొండ గోవింద, జనసేన వార్డు ఇన్ చార్జ్ మారిశెట్టి రాజా, టీడీపీ నాయకులు శెట్టి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లా స్థాయి యోగా పోటీలు

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని వేంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 26న శనివారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి యోగా పోటీలు నిర్వహించనున్నట్లు పాఠశాల హెచ్ఎం మూర్తిరాజు శుక్రవారం తెలిపారు. డీఈవో, ఎంఈవో, ఎస్.జీ.ఎఫ్ అధికారుల ఆదేశాల మేరకు వేంపాడు హైస్కూల్లో జరగనున్న జిల్లా స్థాయి యోగా పోటీల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసామన్నారు.ఉమ్మడి విశాఖ జిల్లాల పరిధిలో నియోజకవర్గాల స్థాయిలో ఎంపికైన విజేతలతో జిల్లా పోటీలుంటాయని, సుమారు 300 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొంటారని తెలియజేశారు.

సామరస్య చర్చలతో

ఎన్ఎఒబి సమస్య పరిష్కారం

ప్రజాశక్తి -ఎస్ రాయవరం: సామరస్య పూర్వక చర్చలతోనే మండలంలో ఎన్ఏఓబి సమస్య పరిష్కారం అవుతుందని, ఇందుకు కృషి చేస్తామని యస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. శుక్రవారం సాయంత్రం మండలంలో నేవల్ బేస్ ప్రభావిత గ్రామమైన బంగారమ్మపాలెంలో ఆయన పర్యటించారు. నేవల్ నిర్మాణాలను పరిశీలించి, నేవల్ అధికారుల నుండి సమాచారం సేకరించారు. అనంతరం ఆయన స్థానిక విలేఖరులతో మాట్లాడుతూ, నేవీ అధికారుల నుండి పూర్తి వివరాలు సేకరించామన్నారు. ప్రభావిత గ్రామమైన బంగారమ్మపాలెం గ్రామస్తులకు పునరావాసం, మత్స్యకారుల బోట్లు షిఫ్టింగ్ చేయడం వంటి అంశాలను కూలంకషంగా చర్చించడం జరిగిందన్నారు. ప్రభుత్వం కూడా మత్స్యకారుల సమస్యల పరిష్కారం పట్ల సానుకూలంగా ఉన్నట్లు తెలిపారు. సమస్యల పరిష్కార సమయంలో మత్స్యకారులు సంయమనం పాటించి, శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా చూడాలన్నారు. గ్రామంలోని సమస్యలతో పాటు, నేవల్ బేస్ సమస్యల పరిష్కారంలో గ్రామస్తుల సహకారంతో కృషి చేస్తామన్నారు. అందరూ కలిసి కూర్చుని సమిష్టి చర్చల ద్వారా సమస్యల పరిష్కారానికి కృషి చేసుకోవాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడరాదని గ్రామస్తులకు తెలిపారు. త్వరలోనే జిల్లా కలెక్టర్, తాను ఇతర అధికారులతో కలిసి గ్రామంలో సమావేశం ఏర్పాటు చేసి సమస్యల పరిష్కార మార్గాన్ని సుగమం చేస్తామన్నారు. ఎస్పి వెంట నర్సీపట్నం ఏ యస్పీ మోహనరావు, సిఐ రామకృష్ణ, నక్కపల్లి సిఐ కుమారస్వామి, పాయకరావుపేట సిఐ జి అప్పన్న, యస్ రాయవరం ఎస్ఐ విభీషణరావులు ఉన్నారు.

ఎస్పి తుహిన్ సిన్హా



మాట్లాడుతున్న ఎస్పి తుహిన్ సిన్హా



పనులను పరిశీలిస్తున్న సర్పంచ్

పూడికతీత పనులు

ప్రజాశక్తి -గొలుగొండ: మండలంలోని ఏఎల్ పురంలో గ్రామ సర్పంచ్ లోచల సుజాత, పంచాయతీ కార్యదర్శి కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో శుక్రవారం కాలువల్లో ముమ్మరంగా పూడికతీత పనులు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామంలోని కాలువల్లో పూడికపోయిన చెత్తను తొలగిస్తున్నామని తెలిపారు.

రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్:ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర 49వ మహాసభలపై శుక్రవారం స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో ఎంఈఓ తలుపులు చేతుల మీదుగా పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి.బాబ్జీ, జి.ఫణీంద్ర కుమార్ మాట్లాడుతూ ,ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర 49వ మహాసభలు నవంబర్ 27 నుండి 30వ తేదీ వరకు విజయనగరం వేదికగా నిర్వహించబోతున్నామని తెలిపారు.27వ తేదీన భారీ ర్యాలీ బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. ఈ మహాసభలు విజయవంతం అయ్యేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు సుధీర్, రవి కిరణ్ పాల్గొన్నారు.

ప్రభుత్వమే గ్యాస్ ఏజెన్సీలకు నగదు చెల్లించాలి

ప్రజాశక్తి -నక్కపల్లి:కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఈనెల 29 నుంచి ఉచిత గ్యాస్ పథకం అమలు చేస్తామని ప్రకటించారని, దీనిని స్వాగతిస్తున్నామని. అయితే ప్రభుత్వమే గ్యాస్ ఏజెన్సీలకు నగదు చెల్లించి లబ్ధిదారులకు ఉచిత గ్యాస్ సిలిండర్ అందే విధంగా చర్యలు చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు, మండల కార్యదర్శి ఎం.రాజేష్ కోరారు. శుక్రవారం స్థానిక సిపిఎం కార్యాలయంలో వారు మాట్లాడారు. గ్యాస్ బుకింగ్ చేసిన తర్వాత గ్రామీణ ప్రాంతాలలో 48 గంటలు, పట్టణ ప్రాంతాల్లో 24 గంటలకు గ్యాస్ కంపెనీలు గ్యాస్ సిలిండర్ సరఫరా చేస్తారని, గ్యాస్ సరఫరా అయిన వెంటనే లబ్ధిదారులే గ్యాస్ ధర గ్యాస్ సరఫరా చేసిన ఏజెన్సీలకు చెల్లించాలని ప్రభుత్వం చెప్పడం భావ్యం కాదన్నారు. గ్యాస్ సరఫరా అనంతరం 48 గంటల తర్వాత లబ్ధిదారుల అకౌంటులో సబ్సిడీ నగదు జమ అవుతుందని ప్రభుత్వం ప్రకటించిందని, లబ్ధిదారులు ముందుగా నగదు చెల్లించే పద్ధతి లేకుండా నేరుగా ప్రభుత్వమే గ్యాస్ సరఫరా చేసే ఏజెన్సీ లకు లబ్ధిదారులు తరుపున నగదు చెల్లింపులు చేపట్టాలన్నారు. పేదలకు ఇబ్బందులు కలిగించే నిబంధనలు వెంటనే సడలించాలని, ఎటువంటి షరతులు లేకుండా అర్హులందరికీ ఉచిత గ్యాస్ పథకం అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎం.రమణ, కె.నూకరాజు పాల్గొన్నారు.



మెటీరియల్ అందజేస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

టెన్త్ విద్యార్థులకు స్టడీమెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలో పెదబోదుగల్లం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు శుక్రవారం హెచ్ఎం సిహెచ్.సత్యనారాయణ, ఉపాధ్యాయులు చేతుల మీదుగా స్టడీ మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం సత్యనారాయణ మాట్లాడుతూ, పాఠశాల ఉపాధ్యాయులు రూ.10 వేల ఆర్థిక సహకారంతో స్టడీ మెటీరియల్‌ను సమకూర్చడం జరిగిందని తెలియజేశారు. 10వ తరగతి పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థుల చదువు పై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నామన్నారు. ఏడు సబ్జెక్టులకు సంబంధించిన స్టడీ మెటీరియల్ విద్యార్థులకు పంపిణీ చేయడం జరిగిందన్నారు. పదిలో శతశాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎన్.వి.ఎస్.ఆచార్యులు, ఎస్.ఫల్గుణరావు, ఎ.వి.ఎల్.ఎన్.కుమారి, రమేష్ బాబు, చిన్నారావు, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న అధికారులు

బాల కార్మికులపై ప్రత్యేక డ్రైవ్

ప్రజాశక్తి -నక్కపల్లి:బాల కార్మికులను నివారించేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టినట్లు ఎలమంచిలి సహాయ కార్మిక అధికారి ఎస్.వెంకటేశ్వరరావు, జిల్లా బాలల సంరక్షణ ప్రతినిధులు లోవరాజు, అమ్మాజీ తెలిపారు. నక్కపల్లిలో శుక్రవారం పర్యటించారు. షాపులను తనిఖీ చేశారు. షాపు యజమానులకు అవగాహన కల్పించారు. పిల్లలను పనిలో పెట్టుకోవద్దని సూచించారు. పనిలో పెట్టుకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంరక్షణ ప్రతినిధులు కె వీ చిన్నారావు,తదితరులు పాల్గొన్నారు.

రేషన్ నిల్వ కేంద్రాల్లో తనిఖీలు చేపట్టాలి

-జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్:రేషన్ దుకాణాల్లో, ఎం.ఎల్.ఎస్. (నిల్వ కేంద్రాలు) పాయింట్లలో తనిఖీలు చేపట్టాలని అవకతవకలకు పాల్పడిన వారిపై 6ఎ కేసులు నమోదు చేయాలని పౌర సరఫరాల శాఖ అధికారులను, తనిఖీ సిబ్బందిని జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్ ఆదేశించారు. రేషన్ సరుకులు దుర్వినియోగం కాకుండా చూడాలని, దారి మళ్లించే వారిపై గట్టి నిఘా ఉంచాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై క్రిమినల్ చర్యలకు ఉపక్రమించాలని పేర్కొన్నారు. కలెక్టరేట్ మీటింగు హాలులో శుక్రవారం ఆయన పౌర సరఫరాల శాఖ జిల్లా అధికారులు, తనిఖీ సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. రేషన్ సరుకుల పంపిణీ, దుకాణాల నిర్వహణ, ఎండియు వాహనాల ద్వారా రేషన్ అందజేత, తనిఖీలు, కేసుల నమోదు తదితర అంశాలపై సమీక్షించారు. క్షేత్రస్థాయిలో బినామీల పేర్లపై కొంతమంది దుకాణాలు నిర్వహిస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని,రేషన్ సరుకులు కూడా సమీపంలో ఉన్న హోల్ సేల్ దుకాణాలకు తరలి పోతున్నట్లు పలు పత్రికల్లో కథనాలు వస్తున్నాయని దీనిపై కింది స్థాయి అధికారులు,సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రేషన్ దుకాణాలు, ఎం.ఎల్.ఎస్. పాయింట్లలో తనిఖీలు చేపట్టాలని వాస్తవ పరిస్థితులపై నివేదిక అందించాలని ఆదేశించారు.హోల్ సేల్ దుకాణాలపై బృందాలుగా వెళ్లి దాడులు చేయాలని సూచించారు. రాత్రి పూట కూడా తనిఖీలు చేపట్టాలని, ఎక్కడైనా తప్పు జరిగినట్లు గుర్తిస్తే క్రిమినల్ కేసులు పెట్టాలని సంబంధిత అధికారులకు చెప్పారు. రబ్బర్ స్టాంపుల వినియోగంలో కూడా అవకతవకలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయని దీనిపై కూడా దృష్టి సారించాలన్నారు. పక్కాగా తూనికలు చేపట్టిన తర్వాత మాత్రమే గోదాముల నుంచి ఎం.ఎల్.ఎస్. పాయింట్లకు సరుకులు సరఫరా చేయాలని ఆదేశించారు. ఎండియు వాహనాలు ఉదయం 7 గంటల నుంచే ప్రజలకు అందుబాటులో ఉండాలని, ఇంటింటికీ వెళ్లి బియ్యంతో పాటు మిగిలిన సరుకులు కూడా పక్కాగా అందజేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో సివిల్ సప్లై కార్పొరేషన్ డిఎం శ్రీలత, జిల్లా సహాయక పౌర సరఫరాల అధికారి కల్యాణి,ఇతర ఎస్ ఓలు, సీనియర్ తనిఖీ అధికారులు,జూనియర్ తనిఖీ అధికారులు పాల్గొన్నారు.



'ఎంత పని చేశావ్ చంటి' చిత్ర యూనిట్ సందడి

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్:పిజెకె మూవీ క్రియేషన్స్ బ్యానర్ పై శ్రీనివాస్ ఉలిశెట్టి హీరోగా, శాంతిప్రియ, హీరోయిన్లుగా ఉదయ్ కుమార్ దర్శకత్వంలో లడ్డే బ్రదర్స్ నిర్మించిన చిత్రం 'ఎంత పని చేశావ్ చంటి' సినిమాకు యూనిట్ నగరంలోని వేంకటేశ్వర థియేటర్‌లో శుక్రవారం సందడి చేసింది. సినిమా విడుదలను పురస్కరించుకుని హీరో శ్రీనివాస్, దర్శకుడు ఉదయ కుమార్, హీరోయిన్లు నీహారిక, శాంతి ప్రియ, ఇతర నటీనటులు ప్రేక్షకులతో కలిసి సినిమా వీక్షించారు. ఈ సందర్భంగా చిత్ర హీరో శ్రీనివాస్ మీడియాతో మాట్లాడుతూ, తొలి రోజే ఈ సినిమాకు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన వచ్చిందన్నారు. కొత్త పాయింట్ టచ్ చేసి తీసిన సినిమా తొలిరోజే ప్రేక్షకుల ఆదరాభిమానాలను ఊహకు అతీతంగా వున్నాయని సంతోషం వ్యక్తం చేశారు. మంచి సినిమాలో అవకాశం ఇచ్చిన నిర్మాతలు లడ్డే బ్రదర్స్ కి ధన్య వాదాలు తెలిపారు.సినిమాలో తనను ఫోటోగ్రాఫర్ సంతోష్ బాగా చూపించారు అని ప్రశంసించారు. కుటుంబంలో జరిగే సంఘటనలు ఆధారంగా వున్న సినిమా కావడంతో ప్రేక్షకుల మన్ననలు పొందిందన్నారు.

హీరోయిన్ నీహారిక మాట్లాడుతూ, ఈ మధ్య కాలంలో కుటుంబ సమేతంగా చూసే సినిమాలు రాలేదన్నారు. ఈ నేపథ్యంలో ఇటువంటి సినిమాలో నటించడం ఆనందంగా ఉందన్నారు. తన పాత్ర కుటుంబం, సమాజంలో ఎదుర్కొన్న సంఘటనలు ఆధారంగా సినిమా తీశామన్నారు.డైరెక్టర్ ఉదయ కుమార్ మాట్లాడుతూ, తాను గతంలో తస్మాత్ జాగ్రత్త సినిమా తీసానని గుర్తు చేశారు. ఇది పూర్తిగా కుటుంబ కథా చిత్రం. నూతన నటీనటులు ఇందులో బాగా నటించారని తెలిపారు. విశాఖ లోనే పూర్తిగా సినిమా తీశామని తెలిపారు.



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న బృందం సభ్యులు

వైద్య సేవలపై టాస్క్‌ఫోర్స్ బృందం ఆరా

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని కృష్ణదేవి పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సీహెచ్.నాగాపురం సబ్ సెంటర్‌లో ప్రజలకు అందుతున్న సేవలపై అనకాపల్లి జిల్లా టాస్క్ ఫోర్స్ బృందం శుక్రవారం ఆరా తీశారు. ఈ సందర్భంగా గర్భిణీలకు, కౌమర బాలికలకు రక్త పరీక్షలు నిర్వహించారు. హెచ్ఎంఐఎస్ రిపోర్ట్స్ పై జిల్లా గణాంకాధికారి ఎ.రామచంద్రరావు అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని, డయేరియా వంటివి ప్రజలకు ఓవర్ హెడ్ ట్యాంక్‌లను తరచూ శుభ్రం చేయించాలని బృందం సభ్యులు సూచించారు. క్లోరినేసన్ ప్రక్రియ నిరంతరం చేపట్టాలని ఆదేశించారు. డిపిఒ జగదీష్, ఆర్‌సీహెచ్ రికార్డ్స్ పరిశీలించారు. డేటా మేనేజర్ జనార్ధన్ ఐడిఎస్పీ ప్రోగ్రాంనకు సంబంధించి పిఎల్ఎస్ ఫార్మ్స్ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారి ప్రవీణ్, పీహెచ్ఎన్ ఎల్.సావిత్రి, ఎంపిహెచ్ఈఓ బివి.సత్యనారాయణరావు, హెచ్‌వి ఎన్.వరలక్ష్మీ పాల్గొన్నారు.

కెజిహెచ్‌కు విశాఖ పోర్టు రూ.కోటి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్:కెజిహెచ్‌లో వైద్య సేవలు విస్తృతికి విశాఖపట్నం పోర్టు సిఎస్ఆర్ నిధుల నుంచి రూ.కోటి ఆర్థిక సాయం అందజేసింది. ఈ విషయాన్ని కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద మీడియాకు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఎం.ఎన్ హరేంధిర ప్రసాద్ కృషి ఫలితంగా పోర్టు ఈ నిధులను సమకూర్చిందని, ఈ మేరకు శుక్రవారం పోర్టు చైర్మన్ నుంచి చెక్కును స్వీకరించడం జరిగిందన్నారు. ఈ నిధులతో కెజిహెచ్ క్యాజువాలిటీ, ఓపి బ్లాకులను అబివృద్ధి చేయడం జరుగుతుందని చెప్పారు. కలెక్టర్ కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



చెక్కు అందజేస్తున్న పోర్టు ప్రతినిధులు

జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని ఏఎల్.పురం మేజర్ పంచాయతీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉమ్మడి విశాఖపట్నం జిల్లా స్థాయి అండర్ -14 బాలబాలికల వాలీబాల్ టోర్నమెంట్ అండ్ సెలక్షన్‌ను ప్రధానోపాధ్యాయులు వి.నాగభూషణం అధ్యక్షతన శుక్రవారం ప్రారంభించారు. ఈ పోటీలకు ఉమ్మడి విశాఖపట్నం జిల్లా 16 నియోజకవర్గాల నుండి నియోజకవర్గ స్థాయిలో గెలుపొందిన బాల బాలికల నుండి ఒక్కొక్క టీమ్ చొప్పున 32 టీమ్స్ రావటం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గ్రామ సర్పంచ్ లోచల.సుజాత ముందుగా సరస్వతి దేవి విగ్రహానికి పూలమాల ఆవిష్కరణ చేసి రిబ్బన్ కట్ చేసి ఆటల పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, విద్యార్థులకు చదువుతో పాటు ఆటలు కూడా చాలా అవసరమన్నారు. చదువు మానసిక వికాసాన్ని ఇస్తే ఆటలు శారీరక దృఢత్వాన్ని ఇస్తాయని చెప్పారు. ముఖ్యముగా గవర్నమెంట్ జాబ్స్ స్పోర్ట్స్ కోటాలో వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ సత్యనారాయణ, కేడిపేట ఎస్సై తారకేశ్వరరావు, ఎస్ఎంసి చైర్మన్ లగుడు వెంకట రాజులనాయుడు, చోద్యం హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు పి. శ్రీనివాసరావు, ఎంపిటిసి సభ్యులు చింతల బుల్లి ప్రసాద్, పాఠశాల వ్యాయమ ఉపాధ్యాయులు టివి.రమణ, మాధవి పాల్గొన్నారు.


పోటీలను ప్రారంభిస్తున్న సర్పంచ్

హోం మంత్రిని కలిసిన ఎస్‌పి

ప్రజాశక్తి -నక్కపల్లి:రాష్ట్ర హెూం మంత్రి వంగలపూడి అనితను విశాఖపట్నంలో శుక్రవారం అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా మర్యాదపూర్వకంగా కలిసి ప్లాంట్ ను అందజేసారు.ఈ సందర్భంగా హెూంమంత్రి ఎస్పీకి పలు సూచనలు చేశారు. నేరాల నియంత్రణలో జిల్లా ప్రథమ స్థానంలో ఉండేలా చూడాలని ఆదేశించారు. గంజాయి నియంత్రణ మీద దృష్టి పెట్టాలని, మహిళల పై దాడులను అరికట్టే విధంగా పనిచేయాలన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ వాతావరణం ఏర్పాటు చేయాలన్నారు.



మొక్కను ఇస్తున్న ఎస్‌పి